ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము జూన్ ౧౯౩౮ { సంచిక ౬

ఆంధ్రులకు ఎంతవరకు సంస్కృతం కావాలి?

ఉభయభాషాప్రవీణ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రిగారు

ఈ ప్రశ్న చాలా విషమ మయినది.

మనము ఉగ్గూ, పాలూ, ఎవరిదగ్గర తాగినాము? ఏతల్లి ఒడిలో పెరిగినాము? అని ప్రశ్నించుకుని వెనక్కి తిరిగి చూస్తే ముసలి అవ్వ గీర్వాణి కనిపిస్తుంది.

మనం కన్నులు తెరిచి మనసారస్వతాకాశమును కలయజూస్తే అంతటా సంస్కృతముద్రలు కానవస్తాయి. "తల్లి సమస్తభాషలకు దైవతభాష" అంటే నిజమే అనుకున్నాం. వైకృత మని స్వతంత్రమయిన మన మాతృభాషకు పేరు పెట్టుకున్నాం. అన్వయపద్ధతీ, పదస్వభావమూ, విభక్తివిన్యాసమూ చూసిన కొద్దీ ప్రకృతి, వికృతిభావము సందేహగ్రస్తమే అయింది. ఆశ్చర్యమే వేసింది. కాగా ఇన్నాళ్లు మన్ని పెంచిన ఆమె మనకు ధాత్రి అవుతుందికాబోలు. అయితే మన తెనుగు 'పరభృతా?' అవును కనుకనే "దేశభాషలందు తెనుగు లెస్స"

దేశభాషాకావ్యములు చదివితే "రౌరవం నరకం వ్రజే" తనే టంత వెర్రిభక్తి కుదిరింది ఒకప్పుడు సంస్కృతంమీద మనవారికి. ఆ అనుశాసనకు 'నమోవాకం' చెయ్యడం ఎవ్వరికీ అవజ్ఞాకరం అనిపించలేదు. అందరూ నిష్ఠతో దానినే భజించారు.

నన్నపార్యుడు విచక్షణుడు. రాజరాజు 'కుమక్కు'తో అనుశాసనకు ఎదురు తిరిగి "రసప్రలుబ్ధధియః—లోకే బహుమన్యంతే వైకృతకావ్యాని చాన్య దపహాయ" అని దేవదత్తం పూరించాడు. తన భారత భాగంమీద, తన అనుశాసనమీద చెయ్యి తిరిగినంతవరకు స్వాతంత్ర్యం ముద్రించాడు. కాని......అసమగ్రమే.

కొద్దిగానో గొప్పగానో మనకూ భాష ఉన్నది. మనకూ వాఙ్మయం ఉన్నది. విద్వాంసులూ, గ్రంథకర్తలూ ఉన్నారు. కాని ఒకరి లక్ష్యమునకూ, ఇంకొకరి ఆదర్శమునకూ సమన్వయం లేదు. నన్నయ స్వాతంత్ర్యకాంక్షను, అథర్వణుడు కాని అహోబలుడు గాని అర్థం చేసికొని ఉండరు. వారి కాలంలోనే నన్నయ ఉంటే తేటతెనుగుభాషలోనే ఆభాషకు వ్యాకరణం ఉండడం సమంజసం అన్న విషయం తప్పక గ్రహించి ఉండును. పందొమ్మిదవ శతాబ్దివరకూ తేటతెనుగులో సరి

యయిన కట్టుబాటుతో (సంస్కృతవాసన ఉన్నదనే కట్టండి) వ్యాకరణం పుట్టడానికి వీలు లేకపోయిందని ఏ ఆంధ్రేతరుడు విన్నా ఎంత నవ్వుకుంటాడో అనిపిస్తుంది. అసలు ఆంధ్రవ్యాకరణ చరిత్రే చిత్ర మయినది. వ్యాకరణం అనగానే మునిత్రయం కావలసివచ్చింది. పాణిన్యాచార్యునిపదవి నన్నపార్యుని కిచ్చి ఖాళీ పడిన కాత్యాయనపతంజలిపీఠములను, అథర్వణాహోబలులు ఆక్రమించారు.

ప్రౌఢప్రాయంగా ఉన్న సంస్కృతభాషకు తదనుశాసకులు నాలుగు ప్రక్కలా గట్లు వెయ్యడంలో అర్థం ఉన్నది. అక్కడికే కొట్టిన ప్రతి గండికీ అడ్డు వేసుకుని ఫరవా లేదు అంటూ వచ్చారు వారూను.

మహాప్రవాహరూపంగా ప్రవహించే దేశభాషలను చలనం లేని భాషలవలె నాలుగు గిరులు గీసి వాటిమధ్య నిలబెట్టి 'కదలితే చూడు' అని కళ్లెర్ర చెయ్యడం వివేకదూర మయిన పని. "శాస్త్రప్రయోగవచసో శ్శాస్త్రం బలవ దుచ్యతే। అనిష్పన్నే పదే తేన ప్రయోగాశ్రయణం మతమ్॥" అనే అనుశాసనను భజించి అహోబలాదులు "అసాధురేవ-కాగతి రితి న విద్మః," అయ్యాది యవిచారమూలకంబు ఇయ్యది నిరాకరంబు అని సంస్కృతాన్ని మాని......వాతలు పెట్టుకోవడం హాస్యాస్పద మయిన విషయం. సంస్కృతవ్యాకరణం ముందు- వాఙ్మయం తరవాత. అనుశాసన కుదురుతుంది. అన్నట్టూ చెల్లుతుంది. మనకు వాఙ్మయం ముందు వ్యాకరణం తరవాత (చింతామణి అసమగ్రం గనక) కనుక సత్కావిప్రయుక్తము లన్నీ ఉపాదేయములే అవుతాయి. ఆకాశం మీద ఉన్న నక్షత్రములను బట్టి పంచాంగములు ఉండడం సబబు. ఈ తాత్వికాంశమును గుర్తించిన తెనుగులక్షణకర్తలు అరుదు. సంస్కృతీయసంధులు, క్త్వార్థకారసంధులూ, షష్టీసమాగమాభావమూ అఖండయతులూ, రలయతులూ, రేఫశకటరేఫమైత్రీ, అన్నీ సత్కావిప్రయుక్తము లయినవే ఉన్నవి. కాని ఏమంటేనా ఇవి ప్రయోగించితే తప్పు. ఇదంతా సంస్కృతరీతిని అర్థంచేసుకోకపోతే వచ్చిన ముప్పు.

మన వాఙ్మయమున సాహిత్యమీమాంసాగ్రంథములు ప్రతాపరుద్రీయమునకు తెనిగింపు లయిన పెద్దన కావ్యాలంకారచూడామణి, భట్రాజు కావ్యాలంకారసంగ్రహమును. కావ్యాలంకారసంగ్రహం వంటి గ్రంథం వ్రాసి వాఙ్మయాన్ని కలత పెట్టడం కంటె వేరే పని చూసుకుంటె బాగుండును. ఇందలి రూఢిమూలాభిధ, సారోపలక్షణ, అజహల్లక్షణ, ధ్వనిప్రసక్తి చూస్తే అడివి ముళ్లూను. మూలగ్రంథమె సందేహం తీర్చాలి. లక్షను మీరిన ధ్వనులూ, తెలుగునకు పనికిరాని దోషములు, ప్రయోగమునకు రాని అలంకారములూ కావ్యాలంకారసంగ్రహంలో ఉన్నవి. ఇదంతా తెనుగు దృష్టి లేకుండా చేసిన పొరపాటు. ప్రతాపరుద్రీయసిద్ధాంతములు నిరసమ్ములె! దాని తరవాత ఎన్నో నవ్యసిద్ధాంతములు పుట్టినవి. ఇటీవల్ల తెలుగులో కావ్యాదర్శము, కావ్యాలంకారసూత్రవృత్తి, కావ్యమీమాంస, పుట్టినవి. ఇవి మరింత పురాణపక్కినే తెలుపుతవి కాని నవ్యరీతులను చూపలేవు. 'ఆంధ్రధ్వని' పుట్టినది కాని 'ఆలోకం' లేదు. చేతికి దొరికిన సంస్కృతగ్రంథం తెనిగించి ఆంధ్రసారస్వతానికి వేసి కట్టడం వాపు కాని బలుపు కాదు. తన వాఙ్మయమును చూసుకుని, దానివిశిష్టలక్షణములను గుర్తించి దానికి సరి యయిన సంస్కృతగ్రంథం తెనిగించినా సరే, అరబ్బీగ్రంథం తెనిగించినా సరే, ఒప్పుకుంటాం. పదకొండవ శతాబ్ది మొదలు, పందొమ్మిదవ శతాబ్ది వరకూ ప్రవృద్ధ మయిన ఆంధ్రవాఙ్మయమును చదివి దాని గుణదోషములు కనిపెట్టి, అందచందములూ, ఔన్నత్యమూ, గుర్తించిన మహానుభావు డున్నాడా? ఉంటే అవిజ్ఞానమూర్తి ఒక సాహిత్యదీపం వెలి

గిస్తే ఆ వెలుగులో ఆయన మహోపకృతికి కృతజ్ఞుల మవుతూ ఆంధ్రమాతను ఆరాధిస్తాం. నన్నయలోని, తిక్కనలోని, సోమనాథునిలోని, శ్రీనాథునిలోని, పోతనాదులలోని విశిష్టగుణదోషములను చెప్పే గ్రంథం అవశ్యం మనకు కావలెను. ఈ ప్రధాన లక్ష్యముతో రచింపబడే గ్రంథమునకు మహోన్నతము లయిన సంస్కృతసాహిత్యమీమాంసలు సహకారపడతవి గాని గుడ్డిగా సంస్కృతసామగ్రిని తెనుగుదేశానికి దిగుమతీ చేసి లాభం లేదు.

ఒకప్పుడు రాజరాజు సాయిస్తేనేం, కవిరాజు అభినివిష్టు డయితేనేం పంచమవేదం తెనుగు పొలిమేరల్లో అడుగుపెట్టి "అయం మహూర్త స్సుమహూర్తో౽స్తు" అన్నది. "విశ్వశ్రేయః కావ్యం" అని కవిరాజుకలం శ్రీవాణీగిరిజాధిపులకు సంస్కృతపు గొంతుతోనే నమస్కరించి సన్నద్ధ మయింది. భారతసంహితను సంస్కృతహిమశిఖరములనుంచి సకలకష్టాలూ పడి తెనుగు భూములకు దించి విశ్వశ్రేయస్కర మయిన కావ్యత్వమును అంతర్వాహినిగా అందులో కలిపి ఇదిమహాపుణ్యక్షేత్రం, అందరూ ఇందులో అవగాహించి జీవన్ముక్తులు కండి అని ప్రబోధించి నన్నప పరలోకమునకు వేంచేసినాడు. నన్నపార్యుని ఉన్నతలక్ష్యమును గుర్తించినవాడు తిక్కయజ్వ. నన్నయలోనుంచి ఒక దివ్యసందేశమును అతడు విన్నాడు "సంస్కృతసారస్వతమును గుడ్డిగా భజించకండి. అది మహాసముద్రం. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా మిమ్మల్ని కబళిస్తుంది. దానితో స్వతంత్రత నశిస్తుంది." అని అతని చెవులలో గింగురు మంది. వెంటనే హృదయంలో స్వాతంత్ర్యోద్రేకమే పొంగువారింది

స్వాతంత్ర్యకాంక్షే పరుగు లెత్తింది.

తత్ఫలితముగా భారతోత్తరసంహితకు, అతడు తెలుగు ప్రాణమే పోసి, తెలుగు తొడవులే తొడిగాడు. కొత్తరూపం ఇచ్చి దీనికి సంస్కృత మేనామూలం అనిపించాడు...అంతే—

ఆంధ్రప్రముఖులు ఇంక పలువోకల పోయి నారు కావ్యములు తెనిగించినారు. కతలు పన్నినారు. ఏమైనా పదహారవ శతాబ్దివరకూ తెనుగు సారస్వతమునకు సంస్కృతము విడిచిన నూతనోజ్జీవనం రాలేదు. పెద్దనార్యుని నూతన "సుధాపథా"లలో నడిచిన తెలుగురాణి 'అహం' అన గలిగింది. పదిహేడవ శతాబ్దిలోని సముఖమువారి వచనకావ్యము స్వతంత్రమే, కాని సంస్కృత వాసన జాస్తీ. సంస్కృతపు 'మడతపేచీ' అన్వయాలూ, గోలాంగూలవర్ణనలూ మన వచనవాఙ్మయం మీదకు కూడా ప్రాకి వారి వచనవాఙ్మయం లాగనే, తస్కృవగాను వికృతంగాను చేసినవి.

తెలుగులో నాటకములు లేని లోపం కంటె సంస్కృతనాటకములు తెలిగించిన అనర్థమే ఎక్కువ.

ఇరువదవ శతాబ్దిలో అధునికకవు లున్నారు. వీరిలో సంస్కృతం ఎరిగిన వారు నూటికి పదిమంది. విశేషసంస్కృతజ్ఞానం కలిగిన ఆదికవులు చెడినట్టే అసలు సంస్కృతం ఎరగని ఈ అంతకవులూ పనికిరానివా రయారు.

మనము బాగా ఆలోచించి చూస్తే సంస్కృతము మనకు గొప్ప ఉపకారమే చేసింది. కనుక దానికి కృతజ్ఞత చూపుతూ దాసులముకాకుండా చూసుకోవడం ఒప్పు.

తేలిన సారాంశ మేమి టంటె—

మనం వ్యాకరణాన్ని అనసరించవలసిన అవసరం లేదు. స్వతంత్ర మయిన ప్రౌఢవ్యాకరణము వంటి ప్రయోగశరణము లయిన వ్యాకరణములు మనకు కావలెను. సీతారామాచార్యులుగారు చూడని ప్రయోగములు, క్రొత్తప్రయోగములూ ఉన్నవి. వాని కంతటికి ఒక వృద్ధవ్యాకరణము వ్రాసుకోవలెను. సాహిత్యసమీక్షలో సంస్కృత వాఙ్మయం బహువికాసము పొందినది. కనుక మన విశిష్టలక్షణములను ఏమరకుండా రసగంగా

ధరము వంటి ఉద్గ్రంథము లను తెనిగించుకోవలెను. కవిభావనైకశరణ్యము లగు కావ్యములను వాఙ్మయాంతరములనుండి తేవడం నిరుపయోగము. దీని వలన స్వతశ్శక్తి నశించి విడిపించుకోలేని దాస్య భావం ఏర్పడుతుంది. చవి చూడ దలచితే ఒకటి రెండు తెనిగించి చాలు. కనుక సంస్కృతకావ్యములను తెనిగించ నక్కర లేదు. అయితే ఒకటి రెండు మంచి నాటకములను సంస్కృతంలోనుంచి ప్రసన్న మయిన వ్యావహారికాంధ్రవచనములో ఎవరయినా చూపవలసి ఉన్నది. సంస్కృతపురాణ వాఙ్మయం విజ్ఞానపూర్ణము. కొన్ని వందల ఏళ్లు తలచింపుకొని కనిపెట్టవలసిన విషయములూ, రస స్నిగ్ధము లయిన సన్నివేశములూ అందులో ఉన్నవి. ఆగ్నేయపురాణం కాళిదాసు కుమారసంభవమునకు దారి చూపిన దంటే దాని ఉన్నతి గుర్తించవచ్చు. గరుడపురాణములో ఎన్నో గొప్ప విషయములు ఉన్నవి. ముఖ్య మయిన పురాణములను మంచి తెనుగులో వ్రాసుకోవడం మనకు చాలా అవసర మయిన పని. సంస్కృతతర్కశాస్త్రమూ, మీమాంసా, గణితమూ, ధర్మసూత్రములు, ఉపనిషత్తులు, వేదమూ పూర్తిగా మనకు స్వాధీనం కావాలి. విజ్ఞానభాజనము లైన సంస్కృతగ్రంథములను ఇంగ్లీషువారు వారి భాషలోకి పరివర్తించుకుని చాలా రోజు లయినది. సంస్కృతపరిసరములయం గున్న మనకంటె వారికి సంస్కృతవాఙ్మయములోని, గొప్పవిషయములూ, రహస్యములూ, బాగా తెలుసు ఒక జాతి ఉచ్చస్థితికి రావా లంటే తగినంత విజ్ఞానసమృద్ధ మయిన వాఙ్మయం దానికి ఉండాలి. ఈ లక్ష్యమును కావ్యము తిన్నగా అందుకో లేదు. పరంపరగా సాధించుతుంది. 'పరివర్ధయి విజ్ఞానం' అన్నారనే కట్టండి. అది కేవలం ప్రశంసామాత్రసారమే.

ఏతావతా—విజ్ఞానమును పెంపొందించే గ్రంథాలే మనకు సంస్కృతవాఙ్మయంనుండి కావాలి. మన జాతికీ, మన వాఙ్మయమునకు నిర్బంధము చేసి మన వ్యక్తిత్వమును, విశిష్టతను అరికట్టే నియమాలూ గ్రంథాలూ మనకు అక్కరలేదు.

(సాహిత్యమందరమునుండి)

ఛాయాదేవి

కొవ్వలి లక్ష్మీనరసింహారావుగారు

మొదటిదృశ్యం

[స్థానం—మగధదేశపు రాజమహల్—సమయం పగలు ౧౨ గంటలు]

(చెలికత్తె అయిన కుమారితో ఛాయ)

కుమారి—ఛాయా! నువ్వూ, మహారాజూ, ఏరోజుకోసం పరితపించారో, ఆరోజు వచ్చింది. బజారు ముస్తాబు చేసేరు. వీధులన్నీ అలంకరించబడ్డాయి. రాజదర్బారుకూడా—

ఛాయ—ఎన్నో రోజులు ప్రతీక్షించాక ఇప్పటికి వచ్చిం దారోజు. ఈదినం మహారాజు సంతోషానికి హద్దు లేదు. ఆయన ఈఉదయం నన్ను కలుసుకొన్నప్పుడు, ప్రపంచకంలో ఉండే ఆనందం అంతా ఆయనకు లభించిం దని నేను గ్రహించాను. చెలీ! నీతో ఏమని చెప్పను? ఆయన నన్నెంతో గాఢంగా ప్రేమిస్తున్నారు. ఈనాడు ఆయన తన హృదయాన్ని ప్రకటించినప్పుడు నాశిరస్సు సిగ్గుచేత భూమిలోకి వంగిపోయిందంటే నమ్మ.

కుమారి—కాని, ఇప్పుడీ విషయమంతా ఎందుకు ఛాయా?

ఛాయ—క్షణకాలం ఆయన స్థితి నాలోచించి తరువాత నావైపు ఒక్కసారి చూడు కుమారీ! వారు నేడు భారతదేశపు చక్రవర్తులు. వారి ప్రతి మాటా శాసనం—ప్రతి సంజ్ఞా ప్రబలమైన ఆజ్ఞ. నేనో—ఒక చిన్న 'పర్వతరాజు' పుత్రికను. ఆయనకూ నాకూ పోలి కెక్కడ చెప్పు.

కుమారి—ఛాయా! నీవీవిషయంలో పొరపడుతున్నావు.

ఛాయ—కాని, వారు నన్ను గాఢంగా ప్రేమిస్తున్నారు. వారెల్లప్పుడూ నన్నే కోరుతున్నారు కూడా. నేను లేనిది వారు బ్రతుకలేరు.

కుమారి—ప్రేమవాహిని కూడా ఒక్కొక్కప్పుడు ఎండిపోతూ ఉంటుంది సుమా.

ఛాయ—ప్రపంచకంలో ఉండే ప్రియతమమైన వస్తువుల్లో కెల్లా నువ్వు ప్రియతమురాల వనీ, నీకోసం పరిపాలించే భారతవర్షాన్ని కూడా అవసర మయితే విడిచిపెట్టడానికి కూడా సంసిద్ధంగా ఉన్నా ననీ ఆయన చెప్పారు.

కుమారి—ఎందుకు కాకూడదు? నువ్వు రెండు మూడు సార్లు ఆయన ప్రాణాలను రక్షించావు.

ఛాయ—అందుకోసం వారు నన్ను ప్రేమించారా? సఖీ! నువ్వు మహారాజును ఎరుగవు. వారి ప్రవృత్తి నీకు తెలియదు. నువ్వు ఆయన శీలాన్ని—ప్రేమనూ—ఉదారభావాన్ని—అవమానపరిచావు. నేను ఆయన ప్రాణాల్ని రక్షిస్తే మాత్రం అది ఉపకార మవుతుందా?

కుమారి—కాదు మరీ? నాఉద్దేశప్రకార మంతే.

ఛాయ—నీఉద్దేశ్యం సరైంది కాదు. సేవకుడు తన యజమాని ప్రాణాలను రక్షిస్తే అది ఉపకార మవుతుందా? తన నాయకుని మీదికి దుమికే శత్రుగణాలను ఎదుర్కొంటే వాడు వాని కుపకారం చేసినవా డవుతాడా? కాదు. అది అతనికి కర్తవ్యం—మనుష్యత్వమూను. వారు భారతవర్షం కోసం ప్రాణాలను సహితం లెక్కచేయకుండా శత్రువుల నెదుర్కొనే సమయంలో నేను వారికి కొద్ది సహాయం చేస్తే అది వారికి ఉపకారం చెయ్యడమా? నేను భారతదేశపు గడ్డలో పుట్టాను—ఆదేశపు అన్నాన్నే తిన్నాను—ఆనీరు త్రాగి—ఆగాలినే పీల్చాను.

కుమారి—నువ్వు చేసిం దంతా ధర్మం కోసమే. కాని దాన్ని మహారాజు మరచిపోతా డని నే ననుకోను.

ఛాయ—మరచిపోరు—మరచిపోలేరు—మరచిపోకూడదు. కాని, వారు నన్ను ప్రేమించడానికి అదే కారణ మని నే ననుకోను. రేపు ఇంకో స్త్రీ ఎవ రయినా ఆయనకు తన ప్రాణాలను అర్పించడానికి సిద్ధపడితే, ఆయన ఆమెను ప్రేమిస్తా రని నువ్వు అనుకొంటావా? కుమారీ! పురుషుల హృదయాలు అంత చవుక అయినవి కావు సుమా!

కుమారి—అయితే, ఆయన నిన్నెందుకు ప్రేమిస్తున్నారు?

ఛాయ—"ఛాయ నన్నె పూజచేస్తూం"దనీ, "నన్ను తప్ప ఇతరుల నెవ్వరిని కన్నెత్తి అయినా చూడ"దనీ, అపుణ్యమూర్తి పూర్తిగా నమ్మాడు. ప్రేమపూరిత మైన ఆయన హృదయం ఆనమ్మకం మీదనే ఆధారపడి ఉంది లేకపోతే నాలాటి స్త్రీలు......ఆహా! ఆయనకు నేనంటే ఎంత దయ! వారు నిజంగా దేవతలే. ఆదేవతాస్వరూపాన్నే నేను ఆరాధిస్తున్నాను—

(ప్రవేశం—చంద్రగుప్తుడు)

చంద్ర—ఎవరిని ఆరాధిస్తున్నావు ఛాయా?

ఛాయ—(మాటాడక తలవంచుకొని సిగ్గుపడుతుంది)

చంద్ర—నే నిక్కడకు రావడం నీకు ఇష్టం లేదనుకొంటాను. ఈమాత్రానికే అంత సిగ్గా! బాగుంది— అవుతే ఇదిగో వెళ్లిపోతున్నాను. (వెళ్లిపోబోతాడు)

ఛాయ—లేదు మహారాజా లేదు—నే—

చంద్ర—నాకన్నీ తెలుసునులే— ఇలాగునరా—ఆవైపు చూడు. (ఛాయ చంద్రగుప్తుని దగ్గ

రగా వచ్చి, అతడు చూపించిన రాజవీధివైపు చూసి)

ఛాయ—ప్రతినాగరికుడును తన పరిపూర్ణశక్తిని వినియోగిస్తూన్నట్లు తోస్తుంది.

చంద్ర—ఎందుకు వినియోగించరు? ఈనాడు వారి ప్రభువు యొక్క వివాహదినం.

ఛాయ—(విచారంతో) కాని—మహారాజా—

చంద్ర—(ఆతురతతో) ఎందుకు ఛాయా? నీ కంఠం అలా శోకరుద్ధం అయిపోయిం దేమి? నీ ముఖకాంతి వాడిం దెందుకు? కళ్లనుంచి ఏమిటి ఛాయా? ఇటువంటి సుఖప్రదమైన సమయంలో ఎందుకు విచారిస్తావు?

ఛాయ—(కన్నీరు తుడుచుకొంటూ) మహారాజా—నేను—

చంద్ర—చెప్పు ఛాయా! చెప్పు. నీరుద్ధకంఠమూ—వాడిపోయిన ముఖము నాహృదయాన్ని చెదరగొడుతున్నాయి చెప్పు మరి. ఊఁ!

ఛాయ—మహారాజా! నేను ఈ ప్రేమవల్ల పూర్తిగా దీనురాల నైపోయాను—(ఒక్కసారి చంద్రగుప్తుని వైపు చూసి తలవంచును)

చంద్ర—(వ్యాకులస్వరంతో)అంటే?—ఛాయా!

ఛాయ—మహారాజా! నేను పేదరాలను. మీకు తగనిదానను—అయినా మీరు నన్నింతగా ప్రేమిస్తున్నారు. ఈ పవిత్రమైన మీప్రేమ ఎప్పటికీ ఇలాగునే ఉంటుందా? ఈ మీప్రేమ దృష్టి ఎప్పుడైనా ఇంకొకవైపు ప్రసరిస్తే—(కళ్లనుంచి కారే నీటిబిందువులను కొనగోళ్ల మీటుతుంది)

చంద్ర—(తొందరగా) ఛాయా! అనవసరమైన ఈ విచారాన్ని నీహృదయంలోనుంచి త్వరగా వేరుచెయ్యి. ఛాయా! నువ్వు నాప్రేమను పరీక్షిస్తున్నావా? అందుకు నేను సంసిద్ధుడనే.

ఛాయ—(ఆతురతతో) లేదు ప్రభూ!—లేదు—నావిచారానికి అర్థం అది కాదు.

చంద్ర—మన యిద్దర జీవితాలకూ కూడా సుఖప్రదమైన ఈనాడు నువ్వు ఎందుకు అనవసరంగా నీ హృదయాన్ని క్షోభింపజేస్తావు ఛాయా? సర్వైశ్వర్యసంపన్నుడు—భారతదేశపు చక్రవర్తి—అయిన చంద్రగుప్తుడు నేడు నీయెదుట నిలచి ప్రేమను—కేవలము ప్రేమభిక్షను మాత్రం వేడుకొంటున్నాడు. మాణిక్యఖచితకిరీటము—రత్నసింహాసనము—బిరుదులు సర్వరాజ్యములును నీదగ్గర సూర్యుని ముందు నక్షత్రాలు.

ఛాయ—(ఉత్సాహముతో) బాగుంది మహారాజా—బాగుంది. ఇటువంటి పవిత్రమైన మీ ప్రేమ తప్ప ఈ లోకంలో నేను కోరదగిన దింకేముంది?

చంద్ర—దేవుని ఎదుట నాప్రేమను నీ ఆధీనం చేస్తున్నాను ఛాయా!

ఛాయ—ఎప్పుడూనా?

చంద్ర—ఆ! దైవసాక్షిగా ఎప్పుడూను.

ఛాయ—(చంద్రగుప్తుని కళ్లల్లోకిచూసి) అయితే, ఈకళ్లు ఎప్పుడూ ఇలాగునే ప్రేమజ్యోతులై వెలుగుతూ ఉంటాయా?

చంద్ర—తప్పకుండా.

ఛాయ—అయితే నాకంటె అదృష్టవతు లింకెవరుంటారు?

చంద్ర—ఉన్నారు ఛాయా!

ఛాయ—ఎవరు?

చంద్ర—నేను—నాప్రియమైన ఛాయా! నేనే కొన్నిగంటలలోనే నువ్వు నాదానవైపోతావు. అప్పుడు ఏప్రబలశక్తీ కూడా మనలను వేరుచెయ్యలేదు.

ఛాయ—భగవంతుడు మనలను వేరుచెయ్యగలడు స్వామీ! అదుస్సహమైన కాలం త్వరలోనే వస్తుం దేమో! అందుకే నాహృదయం ఇంతగా క్షోభించిపోతూంది ప్రభూ!

చంద్ర—అటువంటి తలంపులు దరికి రానీకు ఛాయా! రాచకార్యాలు నన్ను తొందరపెడుతున్నాయి. మరి యిక వెళ్లనా? కాళ్లు ఆడడం లేదు. ఏం చెయ్యను చెప్పు.

ఛాయ—వెళ్లండి మహారాజా—వెళ్లండి.

చంద్ర—(వెళ్లిపోబోతూ) నువ్వు 'మహారాజా' అని పిలవడం నాకు బాగు లేదు ఛాయా!

ఛాయ—ఎలా పిలుస్తే బాగుంటుంది?

చంద్ర—ఆర్యస్త్రీ లందరూ తమ భర్తలను ఎలాగున పిలుస్తారో అలాగున—

ఛాయ—అంటే—

చంద్ర—ఆవిషయం నీకు కొద్దిసేపటిలోనె తెలుస్తుందిలే.

ఛాయ—అయితే అప్పుడే ఆపేరుతో పిలుస్తాను. (నలువైపులా చూసి) కుమారి ఏదీ? (నిష్క్రమించును.)

చంద్ర—(తనలో) ఈప్రేమమూర్తి ప్రేమను తప్ప ఇక దేనిని కోరదు. పాపం! నన్ను మన సారా ప్రేమిస్తూంది. నాఅదృష్టాని కింకేమిలోటు? (చంద్రగుప్తుడు నిష్క్రమిస్తాడు.)

(ప్రవేశం: ఛాయా, కుమారీని)

ఛాయ—(నలువైపులా చూసి) వెళ్లిపోయారా? ఏమో—ఎక్కడయినా ఉన్నారేమో.

కుమారి—పిలుతునా?

ఛాయ—ఎవరిని? నువ్వెవరినిగురించి మాటాడుతున్నావు? నీమాటలు నేను కొంచమైనా వినలేదు. వేరే విషయాన్ని గురించి ఆలోచిస్తున్నాను. ఆవిషయం నీకు తెలుసునా?

కుమారి—(నవ్వుతూ) బాగా తెలుసును. నువ్వు మహారాజు విషయమే ఆలోచిస్తున్నావు.

ఛాయ—అమ్మో! ఎంత చమత్కారివే! (ఆమె ముఖంలో విచారం కనపడతుంది. కుమారి ఆమె వైపు చూస్తూ ఉంటుంది.

ఛాయ—(ఉలికపడి) కుమారీ!

కుమారి—మహారాణీ!

ఛాయ—వద్దు కుమారీ—వద్దు—అప్పుడే అంత పేరుతో పిలవకు—తెలిసిందా?—ఇస్—నువ్వు ఏమిటి అంటున్నావూ? నన్ను ఎవరు కలసికొన గోరుతున్నారు?

కుమారి—వాచాలుడు నీతో ఒక్కగంట మాట్లాడడానికి బయట వేచియున్నాడు.

ఛాయ—ఒక్క గంటేనా? (ఆలోచించి) సరే పిలు. (కుమారి వెళ్లును)

ఛాయ—(తనలో) ఇత నిప్పుడు రావడం ఎందుకోసం? అతనికి నావల్ల ఏమి కావలసి ఉంది? పాపం! ఆ అభాగ్యుడు ఇంకా నాకోసం—

(కుమారితో వాచాలుడు ప్రవేశం)

వాచా—(ఛాయవైపు చూసి) ఛాయా!—నన్ను క్షమించు—మరి—

ఛాయ—స్వాగతం! రండి. క్షేమమా?

వాచా—భగవంతుడి దయవల్ల—

ఛాయ—మీ శుభాగమనానికి కారణం?

వాచా—దేవీ! నువ్వూ నేనూ అనేక సంవత్సరాలనుంచి ఒకే చోట గడిపాము. చిన్నప్పుడు ఇద్దరమూ ఒకే చోట ఆడుకొనేవాళ్లం. జ్ఞాపకం ఉందా? నేను నిన్ను ప్రేమిస్తూ ఉన్నట్లు కూడా ఒకప్పుడు నీతో చెప్పాను—మరి—

ఛాయ—ఆప్రేమ అనే శబ్దాన్ని నీముఖతా ఎప్పుడూ విననని అప్పుడే చెప్పాను కదూ?

వాచా—అప్పటినుంచీ నీఆజ్ఞను పాటించాను కదా?

ఛాయ—మళ్లీ తిరిగి ఇప్పుడు మాత్రం ఎందుకు—

వాచా—అందుకే క్షమింపుమని కోరుతున్నాను. నీదగ్గరనుంచి కడసారి శలవు పొందడానికి వచ్చాను. ఈఅభాగ్యుని ముఖం ఇంక ఎప్పుడూ నీకు కనపడదు లే. తొలిసారి నేను నీముఖం చూసినప్పుడు నాప్రేమ ఇలాగున శిథిలం అయిపోతుందని అనుకోలేదు.

ఛాయ—అదంతా ఇప్పుడెందుకు?

వాచా—మోడువారిపోయిన నాహృదయం ఎప్పటికైనా మళ్లీ చిగురుస్తుందేమో అని ఇప్పటిదాకా నిరీక్షించాను. ఆనిరీక్షణకు కూడా ఇంకెక్కడా తావు లేకుండా పోతూంది.

ఛాయ—నేను నిన్ను సోదరభావంతోటే మొదటినుంచీ ప్రేమిస్తున్నాను. ఆసోదరప్రేమ ఎప్పటికీ అలాగే ఉంటుంది నాహృదయం ఇంకొకరి అధీనం. ఒక స్త్రీయొక్క ఇటువంటి సుఖప్రదమైన వివాహసమయంలో ఇల్లాంటి వ్యాకులప్రసంగాలు తెచ్చి, కష్టపెట్టడం తప్పని నీకు తెలీదూ?

వాచా—కాని—పరిపూర్ణత చెందిన స్వాహృదయాన్ని నేను ప్రేమించిన స్త్రీకి ఆఖరుసారి విప్పి చూపిద్దామని వచ్చాను. నాలో ఉండే జీవశక్తి క్రమంగా క్షీణించిపోతూంది నేను జీవించు నంతకాలమూ నాసర్వశక్తులతోనూ నిన్ను ప్రేమించుకొంటూనే ఉంటాను. దాని నెవరూ అడ్డుపెట్టలేరు— కాని ఇంక ఎప్పుడూ నాప్రేమ విషయం తెచ్చి నిన్ను విచారపెట్టను. ఎప్పుడయినా వాచాలుడు చచ్చిపోయాడని నువ్వు వింటే, ఒక్కవేడి నిట్టూర్పునయినా విడుస్తావని నేననుకొంటాను. అనుజ్ఞ నియ్యి—ఇక శలవు.

(వాచాలుడు నిష్క్రమిస్తాడు)

కుమారి—(ఛాయ వైపు తిరిగి) ఎటువంటి వీరుడు! ఎటువంటి సదాచారుడు! పాపం! అతన్ని చూస్తే నాకు జాలి కలుగుతూంది.

ఛాయ—(నిట్టూర్పు విడిచి) కుమారీ!

కుమారి—ఏమి మహారాణీ!

ఛాయ—మహారాజుగా రెక్కడున్నారో చూడు.

కుమారి—ఇప్పుడాయనతో ఏమి పని?

ఛాయ—ఆయనతో ఒక్క విషయం మాట్లాడాలి. వెంటనే తీసుకొని రా.

కుమారి—మంచిది (నిష్క్రమిస్తుంది)

(ఛాయాదేవి ఆకాశంవైపుచూసి నిట్టూర్పులు విడుస్తూ ఉంటుంది.)

రెండో దృశ్యం

(రాజమహాలులో రెండో గది—సమయం: పగలు రెండు గంటలు—చంద్రగుప్తుడు వాచాలుడు చెరో కుర్చీమీదా కూర్చొని ఉంటారు.)

వాచా—(విచారముతో) మహారాజా! నేనీనాడు మగధదేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోతున్నాను. మీఆజ్ఞకై వచ్చాను.

చంద్ర—వాచాలా! నీముఖం అంత విచారసూచకంగా కనపడుతూం దెందుకు? నీ విచారకారణాన్ని చెపితే, దాన్ని పోగొట్టడానికి ప్రయత్నం చేస్తాను చెప్పు,

వాచా—(ఊరకుండును)

చంద్ర—మాట్లాడ వేం వాచాలా?

వాచా—మాట్లాడకుండా ఉంటేనే మంచిది. నేను మాట్లాడితే మీకు కూడా విచారం కలుగుతుంది.

చంద్ర—ఫరవా లేదు. చక్రవర్తినైన నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను. నీ విచారకారణాన్ని చెప్పు.

వాచా—(ఆశతో) నిజంగా మీరు నావిచారాన్ని పోగొడతారా ప్రభూ?

చంద్ర—అది చంద్రగుప్తుడి శక్తికి మించనిదవుతే—

(ఒక సేవకుడు ప్రవేశం)

సేవ—రాజగురువు లయిన చాణక్యులవారు వచ్చారు. (వాచాలచంద్రగుప్తులు చాణక్యుని కెదురేగి తీసికొని వచ్చి ఉచితాసనాశీనుణ్ణి చేస్తారు. సేవకుడు నిష్క్రమిస్తాడు)

చాణ—చంద్రగుప్తా! ఈనాడు నీవివాహం కాదూ?

చంద్ర—అవును గురుదేవా!

చాణ—నువ్వు నాశిష్యుడ వేనా?

చంద్ర—(ఉలికిపడి) చిత్తము.

చాణ—నేను చెప్పినట్లు చేస్తావా?

చంద్ర—ఆ! చేస్తాను.

చాణ—దైవసాక్షిగా—

చంద్ర—ఆ! దైవసాక్షిగా.

చాణ—అది నీఇచ్ఛావిరుద్ధమయితే

చంద్ర—అవు గాక!

చాణ—అయితే విను. ఇది నీకు పరీక్షాసమయం.

చంద్ర—(కంగారుతో) ఏమిటి గురుదేవా ?

చాణ—ఛాయాదేవిని నీవు పెండ్లాడరాదు.

చంద్ర—(తొట్రుపాటుతో) గురూత్తమా !

చాణ—ఇది చాణక్యుని యాజ్ఞ.

చంద్ర—అయితే—

చాణ—నీ శ్రేయస్సును కోరి నేనిల్లా చెపుతున్నాను. ఛాయతో నీకు వివాహం పనికిరాదు.

చంద్ర—ఏమి ?

చాణ—రాజగురువు నీ ప్రశ్నల కన్నిటికి సమాధానం చెప్పడానికి బాధ్యుడు కాడు.

చంద్ర—క్షమించండి.

చాణ—చంద్రగుప్తా !

చంద్ర—గురుదేవా !

చాణ—నువ్వు చక్రవర్తివి. నీదేశానికి—నీజాతికి నమీద అధికారం ఉంది.

చంద్ర—అవును.

చాణ—ఛాయ ఒక సామాన్యపురాజు కూతురు

చంద్ర—అయితే—

చాణ—అవివాహం భారతవర్షానికి ఎటువంటి ఔన్నత్యాన్నీ తేలేదు.

చంద్ర—కాని—గురుదేవా ! నాహృదయం—

చాణ—భారతవర్ష ఔన్నత్యం నీత్యాగాన్ని కోరుతూంది. ఒక్కసారి వెలుపలకు వెళ్లి చూడు. ప్రజలు నిన్ను ఎలాగున నిందిస్తున్నారో తెలుస్తుంది. అది నీకు ఇష్టమేనా ?

చంద్ర—గురుదేవా ! కేవలనిందామాత్రం అయితే, అది నాప్రేమవాహినిలోని తుంపర.

చాణ—మరి భారతదేశమో ? వల్లకాదు చంద్రగుప్తా ! ఛాయతో నీకు పెళ్లి వల్లకాదు.

చంద్ర—ఛాయవంటి ప్రేమమూర్తితో ఇంకేదీ సాటి కాదుస్వామీ—ఛాయ ప్రేమజ్యోతి—ఆమెది పవిత్రప్రేమ—

చాణ—చంద్రగుప్తా ! అయితే ఈపెళ్లి మానవూ ?

చంద్ర—మానలేను గురుదేవా !

చాణ—మానవా ?

చంద్ర—ఆ పవిత్రప్రేమమూర్తి జీవితాన్ని వ్యర్థం చేస్తారా గురుదేవా ! ఆమెతో పెళ్లి నా ప్రబలప్రతిజ్ఞ. ఆమె నన్ను తన ప్రాణంకన్నా కూడా అధికంగా ప్రేమిస్తూంది. ఇప్పుడు నేను ఆమెతో ఏమని చెప్పాలి ? (నిట్టూర్పు విడచి) అయ్యో ! ఈవిషయం ఆమెకు తెలుస్తే, ఆమె హృదయం తుత్తునియలై పోతుంది కాని ఇంకేమయినా ఉందా ? ఆమె కప్పుడు మానుషత్వంమీద నే అసహ్యం పుడుతుంది—పురుషజాతి నామె వెయ్యివిధాల శపించక మానుతుందా ?

చాణ—చంద్రగుప్తా ! అయితే నువ్వు నా ఆజ్ఞను పాటింపవా ?

చంద్ర—దేవా ! నాకా శక్తి లేదు.

చాణ—చంద్రగుప్తా ! నేను నిన్నింతవరకూ తెలుసుకోలేకపోయాను. ఇప్పటివరకూ నీభుజబలం వల్ల ఆర్జించిన యశాన్ని ఒక్క అబల చేతులో పెడుతున్నావా? ఈ పెళ్లి వద్దని, నీదేశం వెయ్యివిధాల ఘోషపెడుతూంది. చివరకు ఈ వివాహపరిణామం, నీసర్వరాజ్యవిధ్వంసానికీ మూలం అవుతుంది సుమా! బాగా ఆలోచించుకో. చంద్రగుప్తా! ఆలోచించు. నీభావిసంతానంచేత నువ్వు గర్హింపబడతావు. అది నీకు సమ్మతమేనా ?

చంద్ర—నేనేం చెయ్యగలను గురుదేవా ? ఈ పరీక్ష చాలా కఠినమైనది.

చాణ—వత్సా! నీదేశం వైపు ఒక్కసారి సింహావలోకనం చెయ్యి.

చంద్ర—అందువల్ల లాభం?

చాణ—అది నే నెరుగుదును. వత్సా! నేను చెప్పినట్లు చెయ్యి. నీకు శుభమవుతుంది—ఇంక ఎదురాడకు.

చంద్ర—మంచిది—కాని—గురు—

చాణ—ఇప్పుడు నువ్వు చంద్రగుప్తుడు చెప్పవలసిన మాట చెప్పావు. ఇకలే—నాతో రా—(వాచాలుని వైపు చూసి) వాచాలా!

వాచా—(తలవంచుకొని) గురుదేవా!

చాణ—నువ్వు ఛాయదగ్గరకు వెళ్లి, ఈ వివాహం జరగ దని చెప్పు—ఇది చంద్రగుప్తుని దృఢ నిశ్చయ మని చెప్పు—

వాచా—మంచిది.

చాణ—చంద్రగుప్తా! నువ్వు చెయ్యబోయే ఈ ఘనకార్యాన్ని నీప్రజలు వేనోళ్ళ కొనియాడుతారు.

(చంద్రగుప్తుడు చాణక్యునితో తలవంచుకొని పిచ్చివానిలాగ వెళ్ళిపోతాడు.)

వాచా—(తనలో) ఈదుర్భరసందేశాన్ని ఛాయకు ఎలాగ తెలియపరచడం? అయినా నాకర్తవ్యాన్ని నెరవేర్చి, నాదారిని నేను పోతాను అరణ్యాలపడి. (నిష్క్రమిస్తాడు.)

మూడో దృశ్యం

(ఛాయాదేవి విచారముతో ఒక సోఫాపై కూర్చొనియుండగా కుమారి ప్రవేశం)

ఛాయ—(ఆతురతతో లేచి) కుమారీ! మహారాజును కలసికొన్నావా? ఎప్పుడు వస్తారు? ఏమి చేస్తున్నారు? ఆయన ఏమన్నారు? త్వరగా చెప్పు.

కుమారి—మహారాజు ఇప్పుడు చాణక్యుని దగ్గర ఉన్నారు

ఛాయ—ఏమి చేస్తున్నారు?

కుమారి—ఆయన కళ్ళనుంచి వేడివేడి నీటి బిందువులు జలజల రాలుతూన్నాయి.

ఛాయ—ఊఁ!

కుమారి—చాణక్యుడు ఆయన మాటల నెంత మాత్రము వినడం లేదు.

ఛాయ—(విచారంతో) నిజమేనా కుమారీ!

కుమారి—నిజమే. మహారాజు పిచ్చివానివలె అయిపోయారు.

ఛాయ—కాదు కుమారీ! కాదు—అది కూడ మోసమే. పురుషులు మోసగించడంలో చాలా నిపుణులు. ఆయన నన్ను మోసం చేశారు అనడానికి ఏమీ సందేహం లేదు. ఇంతవరకూ జరిగిన వివాహప్రయత్నానికి ఇంతలోకే సర్వవినాశనమూ నా?—కుమారీ!

కుమారి—దేవీ! శాంతించు. నీహృదయానికి తీరని క్షోభ కలిగింది.

ఛాయ—(నిట్టూర్పు విడచి) కుమారీ—ఇలారా!

కుమారి—(ఛాయకు దగ్గరగా వస్తుంది.)

ఛాయ—కుమారీ! ఈ వస్త్రాలంకారాలను నీ చేతులతోనే ధరింపజేసావు కదూ?

కుమారి—ఇలాగున జరుగుతుం దని నాకేమి తెలుసును దేవీ?—మరి—

ఛాయ—వీటి నన్నిటినీ మళ్ళీ నీచేతులతోనే తీసెయ్యి.

కుమారి—(మాట్లాడదు)

ఛాయ—నీవల్ల కాదూ? పోనీలే! నేనే తీసేసుకొంటాను. (సర్వాలంకారాలను తీసివేసి, ఒక పాతచీర ధరిస్తుంది)

కుమారి—ఏమిటి ఛాయా? ఏమిటిది!

ఛాయ—మహారాజు వస్తున్నారా?

కుమారి—అవును—అటు చూడు—

ఛాయ—ఆయనను నేను కలుసుకోనని చెప్పు. (వడివడిగా నడచి వెళ్ళిపోతుంది. కుమారి ఛాయ విడిచిన వస్త్రాలంకారాలను మూటకడుతూ ఉంటుంది—అప్పుడు చంద్రగుప్తుడు చిన్నపోయిన ముఖంతో ప్రవేశం)

చంద్ర—కుమారీ! ఛాయ ఎక్కడ? ఆమె నొక్కసారి తీసుకొని రా.

కుమారి—(తలవంచుకొని వెళ్లును.)

చంద్ర—(తనలో) ఆఖరికి ఆసమయం వచ్చింది. ఇప్పుడు ఛాయతో నేనేమని చెప్పాలి? ఒక అమాయకపు బాలికయొక్క ఆశయాలను—కోరికలను—నాచేతులారా నాశనం చేస్తున్నాను. అమూల్యమైన ఆప్రేమలత నాపదఘట్టనంచేత నలిగిపోతూంది. ఇది వీరత్వం కాదు—కేవలం అత్యాచారమే. ఆ ప్రశాంతతేజోమయముఖపద్మంనుంచి కన్నీరు కా

ల్వాలై పోరడం నేనిప్పుడు చూడాలి. (చాణక్యుని ఉద్దేశించి) ఓగురుదేవా! క్షమింపుడు. ఈ యగ్ని పరీక్షకు నేను తాళలేను. (అటూ, యిటూ, పచారు చేస్తూ, ఛాయాదేవిచే విడువబడిన వస్త్రాలంకారాలను చూసి) పాపం! ఆమె హృదయం ఎంత క్షోభించక పోతే ఇంత పని చేస్తుందా? వాచాలుని వల్ల ఆకర్ణనసందేశం విన్నప్పుడు ఆ అమాయకురాలు నన్ను ఎన్ని విధాల దూరిందో కదా! కాని ఇందు లో నాదోషం అణుమాత్ర మయినా లేదు.

(కుమారితో ఛాయ ప్రవేశం)

ఛాయ—(చంద్రగుప్తుని చూచి) మహారాజా! మీరు వాచాలునిచేత పంపిన సందేశము నిజ మైన దేనా?

చంద్ర—నాదీనావస్థను చూసి, కొంచెం జాలి వహించు ఛాయా! నావంటి నిర్భాగ్యుడీభారత వర్షంలో ఇంకెక్కడా ఉండడు.

ఛాయ—ఆదంతా నే నడగలేను— వాచాలుని చేత పంపిన సందేశము యథార్థము అవునా? కాదా?

చంద్ర—నువ్విలాగు నాపై కోపదృష్టి బరిపితే నేను మాట్లాడలేను ఛాయా! ఇదివరకు అనేక చిక్కుపరిస్థితుల్లో నువ్వు నాకర్తవ్యాన్ని సూచించావు. ఇప్పుడు కూడా ఆ వీరత్వమే అవలంబించి నాకర్తవ్యం నెరవేరేటట్లు చెయ్యి ఛాయా! అబ్బా! ఈమార్గం ఎంతకంటకంగా ఉంది!

ఛాయ—(నిట్టూర్పు విడచి) మహారాజా!

చంద్ర—దేవీ!

ఛాయ—మీరు— నన్ను.........

చంద్ర—దేశం— దేవీ! ప్రజలు—

ఛాయ—(కళ్లనుంచి కారే నీటిని తుడుచు కొంటూ) దేశమా! ప్రభూ! దేశ మేమంటూంది?

చంద్ర—మన వివాహం అనుచిత మని.

ఛాయ—ఏం?

చంద్ర—ఇప్పుడు దేశానికి కొంత శక్తి అవశ్య కమై ఉంది—

ఛాయ—అంటే—

చంద్ర—నువ్వు సాధారణపు రాజకుమారైవు.

ఛాయ—ఊం?

చంద్ర—నువ్వు—ఒక—

ఛాయ—(ఉద్రేకంతో) నేను ఒక సాధారణ పర్వతరాజకుమారై నయినంతమాత్రాన్ని నాపై దోషారోపణమా? నాశీలానికి ఏమి కళంకము? నేను కారుచీకటికంటే నల్లగా ఉన్నానని, నాహృదయం కూడా పాపభూయిష్టమై అపవిత్ర మని తలుస్తున్నారా? మీకు శక్తి ఉంటే నాహృద యాన్ని చీల్చి చూడండి దాని పవిత్రత మీకు తెలు స్తుంది—శరీరాన్ని కోసి చూడండి ప్రతిరక్త నాళంలోనూ పవిత్రప్రేమ ప్రవహించడం మీరు చూస్తారు—

చంద్ర—అవును ఛాయా! కాని, ఈవివాహం వల్ల సామ్రాజ్యం ఏవిధంగానూ వృద్ధిపొందదు.

ఛాయ—(ఈర్ష్యతో) అయితే రాజ్యం విస్తీర్ణం అయ్యేటందుకు ఏమి ఆలోచించారు?

చంద్ర—ఇది గురుదేవుని యాజ్ఞ—

ఛాయ—ఏ మని?

చంద్ర—శల్యూకస్— కూతురు...

ఛాయ—అవును ఆమె చాలా అందమయినది. అర్థబలం, అంగబలం కూడా ఉందామెకు. మరి నేనో! (విలపిస్తూ) ఒక సాధారణపు రాజు కూతుర్ని. సరె, మీకోరికకు నేను అడ్డురాను. ఆసౌందర్యరాసితో సుఖించేటప్పుడు ఎప్పుడైనా నన్ను మీహృదయంలో స్మరించండి— ఇదిగో వెళ్లి పోతాను— కడసారి అనుజ్ఞ నియ్యండి. (చంద్ర గుప్తుని కంఠానికి తన చేతులను బెనవైచి విలపిస్తూ ఉండగా చాణక్యుడు కోపంతో ప్రవేశిస్తాడు— ఛాయా చంద్రగుప్తులు లేచి దూరంగా తొలుగు తారు.)

చాణ—(కోపంతో) ఏమి చంద్రగుప్తా! నీప్రజ లు నిన్ను వేనోళ్ల నిందిస్తూ ఉంటే, నువ్వింకా

ఈఛాయా ప్రేమవల్లరిలో పడి కొట్టుకొంటున్నావా? (ఛాయవైపుతిరిగి) ఛాయా! నువ్వింకా చంద్రగుప్తుని విడిచిపెట్టవా?

(ఛాయ వెళ్ళిపోవును. కుమారి వెనకాల వెళ్లును)

చంద్ర—(వణకుతూ) గురుదేవా?

చాణ—మాటుమాటాడకు—రా—

(తెరలో_మహారాజా_ఛాయ-విషము_రక్షించండి)

చంద్ర—చాణ—(ఒకేసారి) ఏమది?

(కుమారి,ఛాయను మెల్లగా నడిపిస్తూ ప్రవేశం)

కుమారి—మహారాజా! ఛాయాదేవి విషమును మింగినది.

చంద్ర—(పడిపోతూన్న ఛాయను పట్టుకొని) అయ్యో! ఎంత పని చేశావు ఛాయా! కుమారీ! రాజవైద్యుని పిలు.

ఛాయ—(కష్టంతో) వైద్యుడు నాకేమీ చెయ్యలేడు—రాజా! నాతుది దినం నేడే—నేను—నాకర్తవ్యాన్ని నెరవేర్చుకొన్నాను— మీరు మీ కర్తవ్యాన్ని—నెర—వేర్చు—కొం—డి. (పడిపోతుంది)

చంద్ర—(ఛాయముఖంమీద ముఖంపెట్టి విలపిస్తూ) ఛాయా! ఛాయా!

చాణ—చంద్రగుప్తా! నువ్వు ఎవరికోసం విలపిస్తున్నావో—వారింక ఈలోకంలో లేరు.

చంద్ర—(విలపిస్తూ) గురుదేవా! ఛాయ ఇక లేదు! నిర్మలాకాశంలో కోటిసూర్యప్రభగా వెలిగిన తార పాతాళంలోనికి క్రుంగిపోయింది—ఒక మధురగానతరంగం ఈయనంతవాయువులో లీనమైపోయింది— నవవికసితసుకుమారపుష్పం దుమ్ములో కలిసిపోయింది— అయ్యో! పవిత్రప్రేమమూర్తి ప్రాణవాయువు లీయనంతమైన ప్రకృతిలో విలీనమైపోయాయి— గురుదేవా! ఇన్నిటికీ నేనే— నేనే కారణం— ఛాయా! ఛాయా!

(ఛాయమీద చంద్రగుప్తుడు మూర్ఛిల్లిపడిపోతాడు)

తెరపడుతుంది

హరిజనుల జాతి

కోమాండూరి శఠగోపాచార్యులుగారు, ఎం.ఎ., బి.ఎల్

మన దేశమున ప్రస్తుతము పంచము లను పేర నొక ప్రత్యేకజాతి నంతను అస్పృశ్యులనుగా ఎంచుచున్నాము. హారిజను లని యిటీవల పిలువబడు యీజాతివారు మన ఆంధ్రదేశమున మాలమాదిగ లనియు, తమిళప్రాంతమున పరయ అనియు కన్నడప్రాంతమున 'హొలియ' అనియు మళయాళప్రాంతమున 'పుళయ' అనియు బంగాళా మొద లగు ఉత్తరప్రాంతములందు 'నామశూద్ర' 'దోం' 'చమార్' 'మెహాతర్' మొదలగు పేర్లతోను పిలువబడుచు భారతదేశ మంతటను వ్యాపించియున్నారు. వీరి సంఖ్య సుమారు ఆరుకోట్లు—అనగా హిందువులందరిలో 1/4 వంతుకు పైగా నున్నారు. తిర్యగ్జంతువులు కూడ మన యిండ్లలోనికి దేవాలయములలోనికి వచ్చుచుండగా మానవకోటిలోని యీహిందూనిమ్న జాతిని బహిష్కరించి అస్పృశ్యులుగా నెంచుట మానవధర్మమునకు వ్యతిరేక మని యెంచి వారల అస్పృశ్యతను నివారణ చేయుటకు గాంధీజీ మొదలగు కొందరు మహనీయులు ప్రయత్నించుచున్నారు. కొందరు తీవ్రసనాతననాయకు లిందుకు వ్యతిరేకముగా ప్రచారము చేయుచున్నారు. ఈసందర్భమున ఈ అస్పృశ్యు లనబడువారు హిందువులేనా? హిందువులే అయితే అందులో వీరిది

ప్రత్యేకమగు పంచమజాతియా అను ప్రశ్న చర్చకు వచ్చుచున్నది.

వీరి జాతి నిక్రింద పరిశీలింతము. ఇటీవల మన ప్రాంతమున వీరిని ఆది ఆంధ్రు లని, తమిళదేశమున అదిద్రావిడు లని పిల్చుట, వీరు మన ఆదిహిందువు లని చెప్పుట కలుగుచున్నది. పూర్వకాలమున మన దేశమందు ఆర్యులు ద్రావిడులు అను రెండు జాతులవా రుండినట్లును వీరందరు బహుశః అన్యదేశములనుండి హిమాలయముల ద్వారా మన దేశమునకు వచ్చి యుందు రనియు చారిత్రికవిద్వాంసులు చాలామంది తలచుచున్నారు. అప్పటికే భారతదేశమున నొక జాతి జనులు వసించుచుండినట్లు స్పష్ట మగు నిదర్శనములు కలవు. వీరినే చారిత్రికులు తురేనియను లని కొలేరియను లని చెప్పుచున్నారు. ఆర్యవాఙ్మయములో అత్యంత ప్రాచీన మగు ఋగ్వేదములో కూడ 'దాస' 'దస్యు' అను అనార్యజాతివారు ఆర్యులతో యుద్ధము చేసినట్లున్ను ఆర్యులలోనే 'పరస్పర యుద్ధము కలిగినప్పు డందులో నొక కక్షవారు 'దాస' జాతుల సహాయము కలిగి రెండవజాతితో యుద్ధము చేయుచుండినట్లును వర్ణింపబడినది. తరువాత రామాయణమునను ఆర్యులు కాక వానరులు రాక్షసులు అను రెండు ప్రత్యేకజాతు లుండినట్లు చెప్పబడినది. వీరిలో వానరులు ద్రావిడజాతి అనియు రాక్షసజాతి ఆదిమజాతి యనియు తలచుటకు చాల యవకాశ మున్నది. రాక్షసు లప్పటికి నిశాచరులు, క్రవ్యాదులు, (పచ్చిమాంసము తినువారు), నరాశనులు (మనుష్యులనే తినువారు Cannibals) అగుటచేతను మన దేశపు కొండలలోను, మహాటవులలోను మారుమూల లన్ని గురెరిగిన మాయావు లగుటచేతను రాక్షసు లన్న ఆర్యుల కెక్కువ భయమును క్రోధమును కలిగియుండుట సహజము. కాని శ్రీరాములు రావణుని జంపి లంకావిజయము నందిన మీదట భారతదేశము ఏకచ్ఛత్రాధిపత్యమునకు వచ్చెను. అనగా భారతదేశ మేకసామ్రాజ్యములోనికి వచ్చి ఏకజాతి కలిగినది. వానరరా జగు సుగ్రీవుడును రాక్షసజాతిరా జగు విభీషణుడును శ్రీరామ పట్టాభిషేకమున సామంతరాజులుగా వచ్చియుండుట యిందుకు చిహ్న మయ్యెను.

దైవీప్రకృతికిని ఆసురిప్రకృతికిని జరుగు నిరంతర యుద్ధములో అసురిప్రకృతి కొంతకాల ముచ్ఛదశలో నున్నను చివరకు దైవీప్రకృతికే జయము కలుగు నను ఆధ్యాత్మికరహస్యము నే గాక యుగపురుషు లగు శ్రీరాములవారి రాజ్యకాలమున దక్షిణహిందూదేశీయులును లంకాప్రజలును కూడ ఏకరాజ్యములోనికి వచ్చి భారతజాతి యను ఏకజాతి యేర్పడిన దను చారిత్రికసిద్ధాంతమునుగూడ రామాయణమువలన మనము గ్రహింపవచ్చును. (దస్యులు ,రాక్షసులు' అను జాతి అసలు అనార్యజాతి కాదనియు ఆర్యజాతిలోనే అనాగరికులుగా నుండునల్లరంగు గల ఒక శాఖవా రనియు శ్రీ అవినాశచంద్రదాసుగారు Rigvdic India అను తమ గ్రంథమున తెలిపిరి, కాని యీసూచనను చారిత్రికపరిశోధకులలో చాలమంది అంగీకరించలేదు. అసురజాతి రాక్షసజాతి ఒక్కటే జాతియే అని తలచుచున్నారు. కాని అది సరికా దని వేదములవలన స్పష్టపడుచున్నది. అమరసింహుని నిఘంటువులో గూడ అసురుల పర్యాయపదము లొక చోటను రాక్షసుల పర్యాయపదములు వేరుగా మరియొక సందర్భమునను వ్రాయబడి యీరెండును వేరు జాతులుగా ఎంచబడినవి).

,రక్షో' జాతి కూడ పూర్వము యక్షులు గంధర్వులు కిన్నరులు సిద్ధులు వంటివారే అని అమరసింహుని ,విద్యాధరోప్సరోయక్ష రక్షోగంధర్వకిన్నరాః। పిశాచో గుహ్యకస్సిద్ధో భూతోమీ దేవయోనయః॥ అను శ్లోకమువలన సూచన యగుచున్నది. తరువాత మహాభారతకాలమునకు క్రమ

ముగా యీ ఆదిమజాతివారు ఆర్యద్రావిడులతో సంబంధములు చేసుకొనుచుండినట్లు హిడింబి చరిత్ర మొదలగు వానివలన గ్రహింపవచ్చును. నిశాచర, క్రవ్యాద, నరాశనాది స్వభావములు కాలక్రమమున వదలిపోయి ఆర్యనాగరికతయే ఆదిమజాతిలోను వ్యాపించినందున ఆర్యద్రావిడులును ఆదిమజాతివారును కలిసి హిందూజాతిగా రేర్పడినట్లు స్పష్ట మగుచున్నది. ఇటీవల కొందరు తీవ్రసనాతనాయకులు అస్పృశ్యతను సమర్థించు సందర్భమున హరిజనులు హిందువులు కారని సూచించిరి.1 కాని మాలలు మొదలగు యీనిమ్న జాతివా రందరు హిందూ ఆచారములనే అవలంబించియున్నారు. మనవలెనే వీళ్లును రాముడు, కృష్ణుడు, మొదలగు హిందూచారిత్రిక నామములు కలిగి వివాహములు ఉత్తరక్రియలు మొదలగు పనులు హిందూపురోహితులద్వారానే చేయించుకొనుచున్నారు. వీరును హిందూదేవతల నారాధించుచున్నారు వీరు చేయు గ్రామదేవతారాధనయందు చాకళ్లు మొదలగు మిగతా హిందూజాతులు కూడ పాల్గొనుచున్నారు. వెలమవారు మొదలగు కొందరు తమ వివాహములందు వీరి నాహ్వానించి వీరిని మన్నించు ఆచారము కలదు. మరియు వివాహము దత్తత, వారసత్వము సమిష్టికుటుంబపద్ధతి మొదలగు అన్ని విషయములను వీరు హిందూధర్మశాస్త్ర ప్రకారమే చేసుకొనుచున్నారు. అందుచే యిప్పటికిని తక్కిన హిందువులకువలెనే హరిజనులకు కూడా హిందూలాయే మన కోర్టులలో అమలు చేయబడుచున్నది. మన కోర్టు లన్నిటిలో గూడ వీరు హిందువులుగానే పరిగణింపబడుచున్నారు.2 యూరపియనులుకూడా హిందూమతములో చేరినచో వారిని కూడ హిందువులుగానే ఎంచవలెను.3 నూరుసంవత్సరముల క్రిందట హిందువులలో చేరిన ఆదిమజాతి వారిని హిందువులుగానే ఎంచవలె నని ఒక కేసులో ప్రీవీకౌన్సిలువారు తీర్పు చేసిరి.4 అయితే వీరు హిందువులే కాని వీరిది ప్రత్యేకపంచమజాతి అని వీరు శూద్రజాతిలో చేర రని కొందరు అత్రసనాతనీయు లనుచున్నారు. కాని యిందుకు ప్రాచీన శాస్త్రములం దాధారము కనబడదు. అన్నిటికన్న ప్రాచీన మగు ఋగ్వేదసంహితలో 10 వ. మండలములోని పురుషసూక్త మనబడు 13 వ. ఋక్కులో మాత్రమే బ్రాహ్మణాదులు ఎత్తి చెప్పబడిరి. ఇందు జాతివిభజన సూచింపబడిన దని కొందరి యభిప్రాయము. ఇది విరాట్పురుషవర్ణన సందర్భము కాని యిచ్చట కూడ బ్రాహ్మణక్షత్రియ

---

1 గురువాయూరిలో వర్ణాశ్రమ స్వరాజ్యసభయందు అహ్వానసంఘాధ్యక్షులుగా దివాన్‌బహద్దరు టి. ఆర్. రామచంద్రఅయ్యర్‌గా రిట్లే యుపన్యసించిరి. తరువాత మద్రాసులో జరిగిన సనాతనధర్మ పరిషత్తులో అధ్యక్షులుగా శ్రీ. వి. వి. శ్రీనివాసఅయ్యంగారు (ఇదివరలో హైకోర్టుజడ్జిగా నుండినవారు) అస్పృశ్యతానివారణ కోరు గాంధిగారు ధర్మశాస్త్రములకు వ్యతిరేకులైరని అందువలన గాంధీగారును హిందువులు కా రనిసెలవిచ్చిరి.

2 ఇం. లా. రి. 31 కలకత్తా 11 (ప్రీవీకౌన్సిలు) తీర్పు చూడుడు.

3 33 మద్రాసు 342 (చమారులకేసు)

4 2 పాట్నా 230 = 18 లావీక్లీ 597 P. C 44 మద్రాసు 740 = 15 లావీక్లీ 521 P. C.

5 బ్రాహ్మణోఽస్య ముఖ మాసీత్ । బాహూ రాజన్యః కృతః । ఊరూ తదస్య య ద్వైశ్యః,పద్భ్యాగ్ం శూద్రోఽజాయత ॥

శంకరయ్య—ప్రతీదానికీ తిక్కయ్య ప్రెసిడెంటూ, పుత్రయ్య కోశాధికారీని. మనం చచ్చుపెద్దమ్మల మైపోతున్నాం.

కొండయ్య—ఇంకా అవుతున్నా మేమిటి, అయేపోయాం. చివరికి నాకు అసిస్టెంటు సెక్రటరీ పనేనా వచ్చింది కాదు చూశారా?

రామయ్య—నేను తయారు చేశా నయ్యా వీణ్ణి. నా చేతులారా పెంచాను వీడికి గర్వం. వీడికి కళ్లు నెత్తిమీదికి వచ్చేదాకా నేను తెలుసుకోలేక పోయాను. చివరికి నాకే పంగనామాలు పెట్టాడు.

సముద్రయ్య—నీ మేనమామ కొడుక్కి ఉపకారం చేసినప్పుడు నే నెంత చెప్పినా విన్నావా?

కొండయ్య—అదంతా యిప్పు డెందుకూ? ముందు సంగతి యోచించండి.

రామయ్య—సంగతి కల్లా యేం వుంది? మాట్లాడితే నేను డొల్లాకు వేస్తాను. మీరు నా వెనకాల్ల భళిభళీ అంటూ వుండాలి.

సముద్రయ్య—మాకు కూడా నేర్పి, మాచేత కూడా కొన్ని వేయించా లవి. లేకపోతే—

రామయ్య—మనకి పని కావాలా, పేరా?... పోనీ. నేర్పుతాను. ఇప్పుడు పై మేదీ? ఇప్పటికి కానివ్వండి తిక్కయ్య నోరెత్తితే మనం అడ్డు చెప్పాలి. చెప్పి నెగ్గించుకోవాలి. ఇది అయిపోయాక రోజూ మీకు ఇలాంటి సంగతు లన్నీ నేర్పేస్తాను. మన క్లబ్బుకి నేను ప్రెసిడెంటుగా వుంటాను కదా"...ఏమంటారు?

కొండయ్య—నేను వైస్ ప్రెసిడెంటుని.

శంకరయ్య—నేను శక్రటరీని.

సముద్రయ్య—నేను ట్రెజరరుని.

రామయ్య—సంతో,

కొండయ్య—వొప్పుకున్నాను.

శంకరయ్య—నా వోటిచ్చేశాను.

సముద్రయ్య—ఏక్సెప్టెడ్.

రామయ్య—ఇక మన నలుగురిదీ వొకటే మాట. అవునా?

శంకరయ్య—అవును.

కొండయ్య—వో.

సముద్రయ్య—శేషుగ్గా.

రామయ్య—మరి లేవండి,...ఇంకోటి. పుత్రయ్య యెంత డబ్బు వసూలు చేశాడో అది ముందు చెప్పించాలి. ఏమంటూరు?

కొండయ్య—తప్పకుండానూ.

శంకరయ్య—ఇక వాడికి దమ్మిడీ ముట్టనివ్వ కూడదు. వాడిలాంటి డబ్బుతోటే కుటుంబపోషణ చేసుకుంటున్నాడు.

సముద్రయ్య—నేను మన క్లబ్బుకి ట్రెజరరుని. ఆప్రశ్న నేను వేస్తాను. ఏం?

రామయ్య—సరే.

శంకరయ్య—శక్రటరీ కాదూ అది అడగవలసినవాడూ?

కొండయ్య—అసలు ప్రెసిడెంటు కనుక్కోవాలి. అయితే పెద్దమనిషితరహాకోసం అతను వూరుకుంటే వైస్‌ప్రెసిడెంటుది ఆఅధికారం. నేనూ వూరుకుంటా నిప్పుడు మీకోసం. తరవాతి అధికారం శక్రటరీది. ఏమంటే? క్లబ్బు వ్యవహారం అంతా నడిపేవాడు శక్రటరీ. అయితే సొమ్ముతో పని కనక ట్రెజరరు అడిగితేనే బాగుంటుంది. ఏమంటావు రామయ్యా?

రామయ్య—నువ్వు బాగానే చెప్పావు. సంగతి వొకొక్కటే తెలుస్తోంది నిజానూ.

కొండయ్య—హిందూ వూరికనే తెప్పిస్తున్నా ననుకున్నావా యేమిటి నేను. ఈమధ్య చదివి అర్థం చెప్పేవాడు ఎవడూ దొరక్కుండా వున్నాడు. లేకపోతే యీ రూల్సన్నీ యీ పాటికి తెలుసుకోక పోదునా?

రామయ్య—ఇక మనం ఆలస్యం చెయ్యకూడదు. (గడియారం తీసి చూసి) ఈపాటికి పదకొండు గంటలు కాదూ?

శంకరయ్య—(తానూ గడియారం తీసి) నరా, ముప్పావు కూడా అయి వుంటుంది.

రామయ్య—మరి లేవండి,...నాకు చాలా నీరసంగా వుంది. మీలో యెవరేనా శంకరయ్యరు హోటలికి వెళ్లి వొక కప్పు కాఫీ తెచ్చిపెట్టాలి.

శంకరయ్య—శక్రటరీ ఆపని చెయ్యవచ్చునా?

సముద్రయ్య—ట్రెజరరు తెప్పించాలి గాని స్వయంగా తేవచ్చునా?

రామయ్య—ప్రెసిడెంటు ముండాకొడుక్కి—చెయ్యడాని కందరికీ బాధ్యత వుంది. ఇంతకీ యిప్పుడు మనం తిక్కయ్యని పడగొట్టాలి. నాకు నీరసంగా వుంటే యెలాగా?

కొండయ్య—పోనీ నేను తీసుకువస్తాను. ప్రెసిడెంటుకీ, వైస్‌ప్రెసిడెంటుకీ తేడా యేమీ లేదు కదా? (వెడతాడు.)

రామయ్య—భేష్! పూచీ అంటే అదీ. మరి పదండి.

శంకరయ్య—ఇకముందు నేనూ పూచీగానే వుంటాను.

సముద్రయ్య—నీతరవాత నేనూ వుంటాను పూచీగా. అందరూ వెళ్లిపోతారు.

అయిదో రంగం

స్థలం మఠంలో వొక గది. మెంబర్లు అంటే తిక్కయ్య (ప్రెసిడెంటు) తుప్పయ్య (వైస్‌ప్రెసిడెంటు) యల్లయ్య (శెక్రటరీ) పుత్రయ్య (ట్రెజరరు) ఇది వొక పక్షం) రామయ్య, కొండయ్య, శంకరయ్య, సముద్రయ్య, (ఇది వొక పక్షం) అడివయ్య, వనమయ్య (తటస్థులు) కూచుని వుంటారు.

తిక్కయ్య—అనుచరులారా! మీ రంతా నన్ను బావాజీగారి కమిటీకి ప్రెసిడెంటుగా ఎన్నుకొన్నందుకు గ్రామస్థు లంతా చాలా సంతోషిస్తున్నారు. ఈ గ్రామంలో యింతకు నాకంటే తగినవాడు లేనందుకు నేను గర్వపడుతున్నాను. (చప్పట్లు కొడుతూ) మీరు కూడా చప్పట్లు కొట్టండి.

(కొందరు కొడతారు.)

సముద్రయ్య—సొమ్మెంత వసూ లయిందో ట్రెజరరు ముందు చెప్పాలి. నా తీర్మానం యిదీ.

శంకరయ్య—నేను దాన్ని బలపరుస్తున్నాను.

పుత్రయ్య—మీకు చెప్పవలసిన అవసరం నాకు లేదు.

కొండయ్య—చెప్పించి తీరతాం నీ వేత

తుప్పయ్య—పుత్రయ్యకి నేను వోటిచ్చాను. మీరు మాట్లాడగూడ దింక.

తిక్కయ్య—మనం రూల్సుప్రకారం వెళ్లాలి, ముందు పెట్టవలసిన తీర్మానం అది కాదు.

రామయ్య—తప్పకుండా అదే ముందు పెట్ట తగ్గది.

తిక్కయ్య—(తనలో) వీడు అడ్డంగా వస్తున్నాడా యేమిటి? (ఆలోచించి) ఇలా చెప్పి చూద్దాం. (ప్రకాశంగా) పుత్రయ్య తిరిగి తిరిగి వచ్చాడు. చాలాడబ్బు వసూలు చేసుకువచ్చాడు. అందుకు మనం కృతజ్ఞత తెలపాలి. ఇంతకీ వాడు చాలా నీరసంగా వున్నాడు. కాఫీ తాగుదా మంటే అయ్యరు అయిపోయిం దని చెప్పాడు. కనక వాడికి నీరసం తగ్గాక నేను ఆసంగతి చెప్పిస్తాను. ముందు పని కానివ్వండి.

రామయ్య—(తనవారికి రహస్యంగా) ఇప్పటికి వూరుకోండి.

సముద్రయ్య—నా తీర్మానాన్ని ఆఖరుకి అట్టే పెట్టుకున్నాను.

తిక్కయ్య—యల్లయ్యా! నీతీర్మానం చదవ్వోయి!

యల్లయ్య—బావాజీగారు వొంటినిండా వీభూది పూసుకునేవారు కనక శివుడి గుడి వెనక్కాల సమాధి చెయ్యాలి.

తిప్పయ్య—నే నొప్పుకున్నాను.

శంకరయ్య—బావాజీగారు మాట్లాడితే హరిహరీ అంటూ వుండేవారు కనక విష్ణుమూర్తి గుడిదగ్గర దహనం చెయ్యాలి, ఇది నాతీర్మానం.

వైశ్యశూద్రులే చెప్పబడిరి కాని పంచమజాతిని దేనిని సూచింపలేదు. యజుర్వేదమునందును యిట్లే చెప్పబడినది. భగవద్గీతలో కూడ నాలుగువర్ణములే చెప్పబడినవి.1 మహాభారతమందును విష్ణుపురాణమందును2 నాలుగు వర్ణములే ఉదహరింపబడినవి. మనుస్మృతిలోను నాలుగు వర్ణములే చెప్పబడి "వర్ణో నాస్తి తు పంచమః" అనగా పంచమవర్ణమని వేరే లేదని కూడా స్పష్టము చేయబడినది. పంచమజాతి యని ప్రత్యేకజాతి రామాయణ భారతాదులందు గూడ ఉదహరింపబడినట్లు కనపడదు. అట్టి స్థితిలో హరిజనులు ప్రత్యేక మగు పంచమజాతి యనియు అనర్హులనియు ఆకారణమున వారి నస్పృశ్యులనుగా యెంచవలె నని వారిని శూద్రజాతిలో అంతర్భాగముగాను స్పృశ్యులుగాను ఎంచగూడ దనియు చెప్పు వాదమున సారము కనబడదు. ప్రస్తుతపు కోర్టులలో గూడ యీవిషయ మనేకసందర్భములలో చర్చకు వచ్చినది. క్రైస్తవులు హిందువులలో జేరినచో వారు శూద్రులుగ ఎంచబడుదు రని 38 మద్రాసు 342 లో తీర్పు చేయబడినదీ. మెనా రిండా అను ఒక ఆస్ట్రియా దేశపు దొరసాని హిందూమతములో జేరి సులోచన అను పేరు పెట్టుకొని మెరార్జి అను ఒక భాటియాను (వైశ్యకులస్తుని) వివాహ మాడెను. ఆవివాహము చెల్లు నని 52 మద్రాసు 160 లో తీర్పు చేయబడినది. 'డోం' కులపు హరిజన స్త్రీని ఒక కాయస్థజాతి హిందువు వివాహము చేసుకొనెను. ఒక మజహబీ చమారు స్త్రీని జాట్‌జాతి పురుషు డొకడు పెండ్లి చేసుకొనెను. ఈ స్త్రీలను అస్పృశ్యజాతి వారినిగా ఎంచుచున్నను వారు లాప్రకారం శూద్రజాతిలోనే చేరుదు రని ఆకేసులలో తీర్పుచేయబడినది.3 ఇటీవల పూంగవనమ్మాళ్ అను ఒక ఆదిద్రావిడ స్త్రీని మాణిక్యం అను నాయుడు కులస్థుడు పెండ్లి చేసుకొనిన మీదట ఆవివాహము శాస్త్రసమ్మతమా కాదా అని మద్రాసు హైకోర్టులో చర్చకు వచ్చెను. హిందూలా ప్రకారం భిన్నజాతి స్త్రీపురుషుల మధ్య వివాహము సివిల్ మారేజి ఆక్టుప్రకారం రిజస్టరు కానిచో చెల్లదు.4 ఈవివాహము రిజస్టరు కాకుండా మామూలు కులాచారప్రకారం జరిగినది. అందువల్ల ఆదిద్రావిడులు శూద్రజాతిలో వారా లేక వేరే పంచమజాతి అగునా అనే సంగతి ప్రత్యక్షముగా తీర్పుకావలసి వచ్చినది5. ఈపూంగవనమ్మాళ్ అస్పృశ్యురాలు అవర్ణురాలు అగుటచే శూద్రజాతి కాదని మాణిక్యం తరపున చేసిన వాదమును త్రోసివేసి హిందువులలో నాలుగు జాతులే కల వనియు ఆదిద్రావిడులు మొదలగు నిమ్నజాతు లన్నియు శూద్రజాతిలోనే చేరిన వనియు, అందువలన ఆపెళ్లి శాస్త్రసమ్మత మైనదీ లాప్రకారం చెల్లు నని మద్రాసు హైకోర్టువారు ఈసంవత్సరమే తీర్పుజేసిరి. అందుచే ప్రాచీనధర్మశాస్త్రప్రకారమున్ను ప్రస్తుతపు కోర్టుల తీర్పుల

1 చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః। తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయం॥
భగవద్గీత 4 అ. 13 శ్లో.

2 అరణ్యపర్వ అ. 149 శ్లో 18.

అయా జాతుల గుణభేదములు చెప్పు సందర్భమున గూడ గీతలో నాలుగుజాతులే చెప్పబడినది,
అ. శ్లో. 17 బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతపగీత అ. 18 శ్లో. 41-44.

3 51 కలకత్తా 488 10 లాహోర్ 372

4 48 అలహాబాదు 670

5 39 లావీక్లీ 439= ఆలిండియా రిపోర్టరు 1934 మద్రాసు 116 చూడుడు.

ప్రకారము కూడ హరిజనులు హిందువు లగుటయే గాక వారు ప్రత్యేకజాతి కారనియు శూద్రజాతి కులములలో చేరియున్నా రనియు తెలుచున్నది.

మరియు హూణులు మ్లేచ్ఛులు మొదలగు అన్యజాతీయులను స్పృశింపకూడ దని కొన్ని మధ్యకాలపు శాస్త్రగ్రంధములలో కలదు, కాని దేశకాల సందర్భమును బట్టి ఆప్రకార మాచరణ జరుగుట లేదు. అట్లుజరుగుట యిప్పుడు సాధ్యమును కాదు. వారికన్న హిందూజాతీయులే అగు హరిజనులను నికృష్టులనుగా ఎంచుటకు శాస్త్రధర్మము కనబడదు. అందుచే హరిజనుల అస్పృశ్యతకు ఆచారమే కారణ మని యెంచవలసియున్నది.

వర్కింగు కమిటీ

కౌశికుడు

స్థలం పాండురంగవిఠల్ మఠం. హాల్లో వొక మూల బట్టకప్పిన మృతకళేబరం వుంటుంది. హాలుమధ్య కొండయ్య స్తంభానికి చేరబడి కళ్లు మూసుకుని కూచుని వుంటాడు. సుమారు ఉదయం యెనిమిది గంట అయి వుంటుంది. అలాంటప్పుడు ధుమధుమలాడుతూ తిక్కయ్య వస్తాడు.

కొండయ్య—బావాజీగారు సిద్ధి పొందారు. సమయానికి నే నొక్కణ్ణే వుండిపోయాను.

తిక్కయ్య--అయితే?......ఎవ డిచ్చాడు నీకీ అధికారం?

కొండయ్య—ఏ మధికారం?

తిక్కయ్య—ఎవ డిచ్చా డన్నాను. ఇంకా యే మధికారం అని నింపాదిగా అడుగుతున్నావూ?

కొండయ్య—నే నిప్పు డే అధికారమూ చెలాయించలేదే!

తిక్కయ్య—పైగా—నోరు ముయ్యి. ఎవ డిచ్చాడు నీకీ భరవసా? నోరు పెగలదేం?

కొండయ్య—ఏమిటోయి నీ ధోరణీ?

తిక్కయ్య—ఎవ డిచ్చా డంటున్నాను. టముకు వేయిస్తావూ?......ప్రజాప్రభుత్వం వచ్చి మీద పడిపోయే రోజు లివి. వొక్కడి మాట చెల్లడానికి వల్లకాదు. చెల్లదు. నేను చెల్లనివ్వను కూడానూ. తెలుసా? టముకువేయిస్తావూ? ఎన్ని వేల గుండెలున్నాయి నీకు?

కొండయ్య—ఇందులో—

తిక్కయ్య—ముందు నాకు సమాధానం చెప్పుకోవాలి. ఏ మనుకున్నావ్?

కొండయ్య—నువ్వనే దేమిటో నా కేమీ బోధపడలేదు.

తిక్కయ్య—నే నేమన్నా సరే. నా మాటే చెల్లాలి. చెల్లితీరాలి. రెండు సంవత్సరాలు శ్రీకృష్ణ జన్మస్థానంలో కూచుని వుగ్రతపస్సు చేసిన మాట నాది. కనీసం కద్దరేనా కట్టని నువ్వు అందర్నీ కాదని ముందుకు వస్తావేం? దిగూ గ్రం.

కొండయ్య—సంగతేమిటో చెప్ప మంటే వుపన్యాసం పేలగొడతా వేమిటోయ్?

తిక్కయ్య—వుపన్యాసం పేలగొడతానా నీ మీద అవిశ్వాసతీర్మానం లేవగొడతానా? టముకు వేయిస్తావూ?

కొండయ్య—ఎందు కలా కోప్పడతావూ? మంచీ చెడ్డా—

తిక్కయ్య—కట్టిపెట్టు వేషాలు. మళ్లీ మితవాదుల ప్రభ వెలిగిద్దా మనుకున్నావేం పాపం! సిగ్గు సిగ్గు! ముందు క్షమాపణ కోరుకో.

కొండయ్య—ఏం తప్పు—

తిక్కయ్య—వల్లకాదు. వూళ్లో యింతమంది వుండగా—హేమాహేమీలు— నేను— నువ్వేవడ వంట?

కొండయ్య—వుంటే?

తిక్కయ్య—ఎవరితోటీ చెప్పకుండా—

కొండయ్య—ఏమిటీ చెప్పడం?

తిక్కయ్య—ఎవరూ రాకుండా—

కొండయ్య—రావడానికే కాదూ టముకు వేయించానూ?

తిక్కయ్య—ఎవ డిచ్చాడు టముకు వేయించడానికి నీ కధికారం? అది చెల్లదు. గ్రామనౌకర్ని నేను తీసుకువచ్చేశాను, వాడి కివ్వవలసిన కూలి నువ్వొకడవే యిచ్చుకోవాలి.

కొండయ్య—మరింతాలూకు సొమ్ము—

తిక్కయ్య—నీతాత సంపాదించాడా యేమిటది?......ముందు పర్కాంగుకమిటీ యేర్పడాలి. ఏం చెయ్యడాని కేనా ఆకమిటీ నిశ్చయించాలి.

కొండయ్య—దీనికి కమిటీ యేమిటోయ్?

తిక్కయ్య—తీసెయ్యి. బావాజీగారు నీకొక్కడికే గురు వనుకున్నావా యేమిటి? ముందు బావాజీగారి శవాన్ని కమిటీ కప్పగించాలి. అప్పుడు గాని—

కొండయ్య—అంతా దారుణంగా వుంది.

తిక్కయ్య—నోరెత్తవద్దు.

కొండయ్య—అయితే నీయిష్టం వచ్చినట్టు చేసుకో. నా కెందుకూ యీ గొడవా? (తప్పించుకుని వెళ్లిపోబోతాడు)

తిక్కయ్య—ఎక్కడికి? (గుమ్మాని కడ్డంగా నుంచుని) కదలడానికి వల్లకాదు. శవాన్ని యెవరి కప్పగించావోయి పప్పూ?

కొండయ్య—నువ్వున్నావు కాదూ?

తిక్కయ్య—నా కిదొక్కటే పనా!

కొండయ్య—నాకు మాత్రం?

తిక్కయ్య—బావాజీగారు తమ శరీరాన్ని నీ కప్పగించారు. నువ్వు కమిటీకి—

కొండయ్య—నే నింకా దంతధావన మేనా చేసుకో లేదుకదా—

తిక్కయ్య—శవాన్ని కమిటీ వప్పగించుకునీదాకా పూచీ నీదీ తెలిసిందా? చచ్చినట్టుకూచో. బావాజీగారికి జెయ్యీ! (వెళ్లిపోతాడు)

కొండయ్య—ఇదేమిటి యీ దారుణం? మతి వుందా లేదా యితనికి?...కానీ యేం జరుగుతుందో చూద్దాం. (ఆలోచించి) కమిటీ యేర్పడుతుందా? దానికి అసిస్టంటుసెక్రటరీ షిప్పేనా కొట్టెయ్యాలి మనం. ఇదీ వొకందుకు బాగానే వుంది. (మళ్లీ ఆలోచించి) ఇతగాడు చూడవచ్చాడాయేమిటి? దొడ్డిదారిని వెళ్లి శంకరయ్యారుహోటల్లో కసిన్ని కాఫీనీళ్లు తాగేసి వచ్చేస్తాను.

(వెళ్లిపోతాడు)

రెండోరంగం

స్థలం వొక వీధి. ముందు సుబ్బయ్యా, తరవాత శంకరయ్యా నడుస్తూ వుంటారు. తొమ్మిదయి వుంటుంది.

శంకరయ్య—బావా! నీవోటు నా కివ్వాలి.

సుబ్బయ్య—నువ్వు న న్నెన్నుకోవాలి.

శంకరయ్య—నావంటివాళ్ల గొప్పతనం నువ్వు కనిపెట్టవలసిన సమయం యిది. అనేకమాట్లు నేను శ్రీకృష్ణజన్మస్థానానికి వెళ్లడానికి సిద్ధపడ్డవాణ్ణి.

సుబ్బయ్య—వందలకొద్దీ అనేకమాట్లు చందాలిచ్చినవాణ్ణి నేను.

శంకరయ్య—అలా కాదు.

సుబ్బయ్య—ఇలాగా కాదు.

శంకరయ్య—వోటంటే యేమిటో నీకు తెలవదు. నామాట విను.

సుబ్బయ్యా—నీకు తెలిస్తే అదేమిటో చెప్పు చూస్తాను.

శంకరయ్యా—నాతో నువ్వు వాదిస్తా వనుకో లేదు.

సుబ్బయ్యా—ముందు నువ్వే మొదలుపెడతా వనుకో లేదు నేను

శంకరయ్యా—కొంచెం యోచించు.

సుబ్బయ్యా—బాగా నిదానించు.

శంకరయ్యా—నువ్వు చిన్నవాడవు—

సుబ్బయ్యా—భారం అంతా చిన్నవాళ్లమీదే వుం దన్నారు గాంధీగారు.

శంకరయ్యా—నిజమే. చిన్నవాళ్లు పెద్దవాళ్లు చెప్పినట్లు పని చెయ్యా లని దాని కర్థం.

సుబ్బయ్యా—పెద్దవాళ్లకి శ్రమ కలిగించకూడ దని దాని భావం దేశం అంతా గాంధీగారిని ప్రెసిడెంటుగా ఎన్నుకుంటే వారు దాన్ని నెహ్రూగారి కిచ్చేశారు మరిచిపోయావా యేమిటి?

శంకరయ్యా—వోరి నీయిల్లు బంగారం—

సుబ్బయ్యా—వోరి నీతస్సా—

శంకరయ్యా—సరే మరిచిపోకు.

సుబ్బయ్యా—డైరీలో యెక్కించుకో నువ్వు.

(వెళ్లిపోతారు.)

మూడో రంగం

స్థలం మరో వీధి. తిక్కయ్యా రామయ్యా నడుస్తూ వుంటారు.

రామయ్యా—ప్రతీదానికీ పుత్రయ్యని నువ్వు వెంటబెట్టుకువెళ్లడం యేమీ బాగా లేదు. నీకు చాలా అపకీర్తి వస్తోంది.

తిక్కయ్యా—వాడు లేకపోతే నేను వొప్పుకోను. మాయిద్దరికీ వొకటే ప్రాణం.

రామయ్యా—అయితే ఆమాట నాకెందుకు గాని—ఈమాటు బాబాజీగారు టచ్చిపోయిన కమిటీకి నన్ను నువ్వు ప్రెసిడెంటుగా ప్రతిపాదించాలి.

తిక్కయ్యా—అదేమిటి?

రామయ్యా—రూల్సన్నీ తెలిసినవాణ్ణి నేను. అనేకమాట్లు నాకు అదృష్టం తప్పిపోయింది. ఇప్పుడేనా నువ్వు కొంచెం ఆలోచించాలి.

తిక్కయ్యా—మరి నామాట?

రామయ్యా—మరొక్కప్పుడు నువ్వు నిలుస్తువు గాని.

తిక్కయ్యా—నువ్వే వుండరాదూ అప్పటిదాకానూ?

రామయ్యా—నిన్నింతవాణ్ణి చేసినవాణ్ణి నేను జ్ఞాపకం వుందా!

తిక్కయ్యా—నువ్వు నాకు చేసిం దేమిటి!

రామయ్యా—అలా అంటా వేం? ఏదో కమీషన్ డబ్బు లేరుకుంటూ వుండేవాడికి వ్యవహారం అంతా నేర్పి—

తిక్కయ్యా—నువ్వు కాకపోతే మరొకడు నేర్పుతాడు. నీ నోష్టనే పొడిచిందా యేమిటి పొద్దు? కాకపోయినా నా కేమీ చేతకా దనీ, అంతా నువ్వే నేర్పావనీ చెబుతున్నావుట అంతటానూ. జాగ్రత్త. ఏమనుకున్నావో నీ మట్టుకు.

రామయ్యా—అబద్ధమా?

తిక్కయ్యా—ఆమాటకి వస్తే నీ కేం తెలుసు నాకు చెప్పడానికి? ప్రతీవానికీ సిఫార్సు విం టూ వుంటే యిలా లోకువ కట్టావా? కబడ్దార్!

రామయ్యా—ఇంకులో లోకువ యేం వుందీ! అంతా సత్యం—

తిక్కయ్యా—చాలించు నీ పాండిత్యం ఇక నావెంట రాకు. దూరంగా వుండు. ఓహో!

(వెళ్లిపోతాడు)

రామయ్యా—ముదిరింది. ఇక పడగొట్టాలి వీణ్ణి. అడుగు ముందుకు పడనివ్వను.

నాలుగో రంగం

స్థలం మఱ్ఱిదొడ్డిలో చింతచెట్టుకింద. రామయ్యా శంకరయ్యా, కొండయ్యా. సముద్రయ్యా ఆలోచనలో వుంటారు.

కొండయ్య—దీన్ని నేను బలపరిచాను.

యల్లయ్య—నే నొప్పుకోను. నాతీర్మానమే నెగ్గాలి.

శంకరయ్య—నాతీర్మానమే పాసు కావాలి.

తిక్కయ్య—యల్లయ్య సబబుగా చెప్పాడు. శంకరయ్యా! నీతీర్మానం నువ్వు తీసేసుకోవాలి.

రామయ్య—శంకరయ్య తీర్మానం రూల్సుప్రకారం వుంది. యల్లయ్యే తన తీర్మానం తీసేసుకోవాలి.

సముద్రయ్య—అదిగదీ. మాప్రెసిడెంటే నీకు కొస్తంత రూల్సు చెప్పాడు. రామయ్యమాటకి అడ్డు చెప్పకు.

తిక్కయ్య—నాకు దేవుడు చెప్పాడుగాని మరెవ్వరు చెప్పలేదు రామయ్యకి నాకంటే యెక్కువ తెలుసునా యేమిటి?

రామయ్య—నీకే యెక్కువ తెలిస్తే వ్యవహారం నడిపించుకు వెళ్లు చూస్తాను

తిక్కయ్య—వొక్కదెబ్బని.....నేను యల్లయ్య తీర్మానాన్నివోటుకు పెడుతున్నాను.

(రామయ్య, కొండయ్య, శంకరయ్య అడివయ్య సముద్రయ్య పక్షంగా వోటువేస్తారు)

సముద్రయ్య—నేనే గెలిచాను. నాకే వొక వోటు యెక్కువ వచ్చింది.

తిక్కయ్య—నా కేష్టింగువోటు యల్లయ్యకిచ్చాను.

రామయ్య—ఇద్దరికీ సమంగా వోట్లువచ్చాయి.

తిక్కయ్య—వనమయ్యా! నువ్వు వూరుకున్నా వేం?

వనమయ్య—నేను బావాజీగారిని గోదావరిలో ముంచెయ్యా లని తీర్మానం పెడుతున్నాను.

తిక్కయ్య—(కొంచెంసేపుచూసి) నీ తీర్మానాన్ని యెవరూ బలపరచలేదు. కనక అది పోయింది.

వనమయ్య—అయితే నావోటు యెవరికీ యివ్వను.

తిక్కయ్య—అయితే యిప్పుడు రెండుపక్షాలకీ వోట్లు సమానంగా వచ్చాయి కనక నేను ఇప్పుడు లాటరీ వెయ్యా లని ప్రపోజు చేస్తున్నాను.

రామయ్య—నేను వల్లకా దని ప్రొటెస్టు చేస్తున్నాను.

తిక్కయ్య—అయితే లాటరీ వెయ్యడమా మానడమా, దీనికి వోట్లివ్వండి.

యల్లయ్య. తుప్పయ్య, పుత్రయ్య, తిక్కయ్య పక్షం వోటు చేస్తారు. కొండయ్య, శంకరయ్య సముద్రయ్య,రామయ్య పక్షంగావోటుచేస్తారు.

రామయ్య—ఇది కూడా సమానం అయింది.

తిక్కయ్య—నా కేస్టింగు వోటు—

రామయ్య—తీర్మానం పెట్టినవాడవు నువ్వే కనక యిక నీకు కేస్టింగు వోటు లేదు.

తిక్కయ్య—వుంది. నేను ఇచ్చేశాను. నాతీర్మానమే నెగ్గింది.

అడివయ్య—అయితే నావోటు రామయ్యకిచ్చాను.

తిక్కయ్య—ఇంతసేపటిదాకా యేం చేస్తున్నావూ? నీ వోటు చెల్లదు.

వనమయ్య—మమ్మల్నడిగావా నువ్వు? నావోటు కూడా రామయ్య కిచ్చాను.

తిక్కయ్య—మన కిప్పుడు పని ప్రధానం. అప్పుడే పన్నిండు గంట లయింది. కనక మీరంతా నా ఆజ్ఞప్రకారం నడుస్తా రని నమ్ముతున్నాను.

కొండయ్య—వల్లకాదు. నీ ఆజ్ఞేమిటి మాకు?

తిక్కయ్య—అయితే యిది యిలా అట్టే పెట్టి మరోపని చూద్దాం.

రామయ్య—అయితే యిప్పటికి పొద్దుపోయింది. కనక భోజనాలు చేసివద్దాం.

తిక్కయ్య—(స్వగతం) ఇదీ బాగానే వుంది. ఈలోపుగా అడివయ్యనో, వనమయ్యనో తిప్పేసుకోవచ్చు. రామయ్య చేస్తున్నా డిదంతా. వాడి క్కూడా ఏదో టాకీ వెయ్యవచ్చు. (ప్రకాశంగా) అలా చేద్దాం.

అంతా బాగుం దంటే బాగుంది అంటూ వెళ్లి పోతారు.

ఆరోరంగం

స్థలం గ్రామచావడి మున్సబూ వొక నౌకరూనూ.

మున్సబు—శవం వెళ్లిందా లేదా?

నౌకరు—యింకా మఠంలోనే వుందండి. వారికి తగువులు తీరలేదుటండి.

మున్సబు—అప్పుడే రెం డయింది. వూరంతా గోల పెడుతున్నారు. కొందరు వంటలు కూడా చేసుకోలేదు. కనక శవాన్ని ఆపడానికి వీలులేదు. ఈబకీరు పుచ్చుకుని నువ్వు రాజమండ్రీ వెళ్లి పోలీసువారి కిచ్చిరా.

నౌకరు—చిత్తమండి.

ఇద్దరూ వెళ్లిపోతారు.

ఏడోరంగం

స్థలం మఠంలో వసారాగది. మళ్లీ కమిటీ అంతా కూచుని వుంటారు.

తిక్కయ్య—అప్పుడే నాలుగయింది. శవాన్ని అట్టేపెట్టడానికి యిక వీలు లేదు. కనక మీరంతా నామాట విని తీరాలి.

పుత్రయ్య—ఇప్పు డధికారం అంతా తిక్కయ్యది. కనక మీ రేమీ చెయ్యలేరు.

రామయ్య—చూస్తాం కాదూ.

యల్లయ్య— అయ్యా మనమంతా వొక వూళ్లోవాళ్లం. బావాజీగారి శిష్యులం. కనక మనలో మనం తగువులాడుకోడం ధర్మం కాదు. ఇప్పటికే పొద్దుపోతోంది. మనకి ఈవిషయంలో రాజీ అయినా ఈ చలికాలంలో రాత్రి శవాన్ని ముట్టుకుని స్నానాలు చెయ్యడం కష్టం. కనక ఈ సభని రేపు పొద్దున్నకి వాయిదా వెయ్యవలసిందని నేను తీర్మానం పెడుతున్నాను. మీరంతా అంగీకరించాలి.

రామయ్యపక్షంవాళ్లు సరే అంటారు. తిక్కయ్య పక్షంవాళ్లు బాగుంది అంటారు. తిక్కయ్య మఠానికి తాళాలు వేసేసి బయటికి వస్తాడు.

తిక్కయ్య—మళ్లీ రేపు పొద్దున్న యెనిమిది గంటలకి మీటింగు. (యల్లయ్యని దూరంగా పిలిచి) ఇదంతా రామయ్య చేస్తున్నాడు. యెలాగో బిత్రరీ చేసి రంగసాన్ని తగిలిస్తే వాడు మనకి లొంగిపోతాడు.

యల్లయ్య—అది బాగుంది, మూడునిమిషాలలో ఆపని చేసేస్తాను.

(ఇద్దరూ వెళ్లిపోతారు)

రామయ్య—(తనవారిని చేరదీసి) ఏం? ఇంకేం చేస్తాడూ? మీరు తిరిగిపోకూడదు. తెలిసిందా?

అందరూ సరే అంటే సరే అనుకుంటూ వెళ్లి పోతారు)

తుప్పయ్య—(స్వగతం) మున్సబు బకీరు రాశాడని తెలిసింది. యెకాయెకీని నేను బెజవాడ వెళ్లిపోతాను. (వెళ్లిపోతాడు)

పుత్రయ్య—(స్వగతం) బావాజీగారిని సమాధి చెయ్యడానికి పాతిక రూపాయలు చాలు. తతిమ్మా యాభయ్యో నీలాచలానిక్కి రెండు నెల్ల జీతం—సెబాస్! తిన్నగా రాజమండ్రి వెళ్లిపోతాను.

(వెళ్లిపోతాడు)

ఎనిమిదో రంగం

స్థలం మఠం. పోలీసులూ, మున్సబూ, నౌకర్లూ అరస్థ సావాలలో వుంటారు. తుప్పయ్యా, పుత్రయ్యా తతిమ్మా వర్కింగుకమిటీ మెంబర్లంతా అరెస్టు చెయ్యబడి వొకపక్కని నిలవబెట్టబడివుంటారు.

ఇనస్పెక్టరు—— మున్సబుగారూ! తుప్పయ్యని, పుత్రయ్యని కూడా అరెస్టు చేసి తీరాలి. పుత్రయ్య సానియింట్లో తప్పకుండా దొరుకుతాడు. వీళ్లనందర్నీ మేము స్టేషనుకి తీసుకు పోతాం. మీరూ హెడ్‌కానిస్టేబులూ దగ్గరవుండి శవాన్ని సమాధి చేయించి తెల్లవారేటప్పటికి మాకు రిపోర్టు అందచెయ్యాలి. తెలిసిందా?

మున్సబు—చిత్తం.

తిక్కయ్య—అయ్యా! ఇనస్పెక్టరు గారూ! శవం వర్కింగుకమిటీ స్వాధీనంలో వుంది, కమిటీ యేదో విధంగా తీర్మానించకుండా శవాన్ని కదపడానికి మీ కేం అధికారం వుంది?

ఇనస్పెక్టరు—అదంతా స్టేషనులో చెబుతా గాదూ?

తిక్కయ్య—సరే కానివ్వండి. ఈకుట్ర అంతా మున్సబు చేశాడు. తాలూకాబోర్డు ఎలెక్షనులు దగ్గిరికి వస్తున్నాయి లెండి. అప్పుడు మున్సబుకి వొక్కవో టేనా రానిస్తానేమో చూద్దురు గాని. ఇనస్పెక్టరు—పదపద.

(తెర)

కొత్త పాత కవిత్వాలు

దువ్వూరి సూర్యనారాయణమూర్తిగారు

"గుణదోషౌబుధో గృహ్ణన్ ఇందుక్ష్వేళా వివేశ్వరః
శిరసా శ్లాఘతే పూర్వం పరం కంఠే నియచ్ఛతి"

అన్నట్లు ఓగ్రంథాన్ని గాని ఓవాఙ్మయవిషయాన్ని గాని ఓసాంఘికవిషయాన్ని గాని నిష్పాక్షికంగా విమర్శించవలసివస్తే అందులో గుణదోషాల్ని రెండింటిని తీసుకొంటూ గుణాలనే చాటుతూ దోషాలని మనస్సులో పెట్టుకుని వూరుకోవడమే పండితలక్షణం. అయితే నిష్పాక్షికానికి అర్థం ఏమిటని అంటే కుండ బద్దలుకొట్టినట్లు మొహంమీదే చెప్పమని గాదు. మొహమాటాలూ మోక్షాలూ వదలుకొని దోషైకదృక్కుతో రంధ్రాలనే యేరి ఆవిష్కరించమనీ కాదు. కొంతకాలాని కైనా ఎవరి తప్పు వారే దిద్దుకో మంటుంది. కనక "నొప్పించక తానొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యు"డనే రకంలోకి వస్తే లోకానికి విరుద్ధంగా వుండదని నా వుద్దేశం. ఒకరి ఆశయాల్ని ఒకరి నియమాల్ని ఒకరి రుచుల్ని పట్టి లోకం అంతా అల్లాగే నడవాలంటే అది అస్వాభావికంగా వుంటుంది. "లోకో భిన్నరుచిః" కాను మఱీ!

ప్రబుద్ధాంధ్రలో పడ్డ "తెలుగువారిదేశ భాషాభిమానం" అనేవ్యాసం రెండుమూడు సార్లు చదివేను. అది వ్రాసినవారు బులుసు వెంకటరమణయ్యగారు. వీరు నాకు చిరపరిచితులు. స్నేహకోటిలోవారూ అవడంచేతనున్ను, వారి ఊహల్లో నాకు అభిప్రాయభేదా లుండడంబట్టిన్ని దానిమీద మామిత్రులతో కొన్ని విషయాలు చెప్పదలచుకొన్నాను. లోకానికి మాత్రం కాదు సుమండీ! ఎంచేతనంటే ఎవడి స్వేచ్ఛకి ఎవరు శాసకులు. మాటవరసకి మనం అనుకోవలసిన మాటలు గాని యివన్నీని—

ఓదాన్ని పూర్తిగా నిరసిస్తున్నా మంటే ఆబాపతు పుస్తకాలన్నీ బాగా చదవాలి. వాట్లో భావాల పొందిక మనస్సుకి అందచేసుకోవాలి. అప్పుడు పూర్వానుభూతాల రుచి ఈకొత్తరుచికన్న వెకటా తియ్యనా అనేది ఆలోచించుకోవాలి. అప్పుడు ఈవిషయాల్లో పాతవి బాగున్నాయి, ఈ విషయాలు కొత్తలో బాగున్నాయి అని నిరూపించాలి అంతే గాని ఎవడో పుల్లాయి రాసేడని ఒకధ మరో యెల్లాయి రాసేడని మరో ఘట్టం చచ్చువి ఏరి వాటిని పట్టి వాఙ్మయానికి కవులకీ బలాదూరెట్టడం అదో మోస్తరు దాంపత్యం లా వుంటుంది.

ముఖ్యంగా ఈపాత్రక్రొత్తకవిత్వాల్లో మార్పు దేశకాలపాత్రాల్ని, మనవంటి వాళ్ల రుచిభేదాన్ని అనుసరించి బయల్దేరుతోంది. అందుచేతే అందుల్లో కొన్ని విషయాలు విరుద్ధాలయినా మామిత్రుల వుపన్యాసంలోని నాల్గవ పేరా మొదలు తొమ్మిదో పేరా వరకున్న కొన్ని సంగతులు నిజాలే. పరిచయం మనకి తక్కువవడంచేత మన కవి అసంభవా లవచ్చు.

అసలు వీరి మొదటి విసురు. "ఉదారాదర్శంగా సంస్కృతాన్ని గ్రహించి దాల్లోలాగ రసప్రధానగ్రంథాలు తెనుగులో లేకపోవడం లోటే" అనే దానిమీద పడింది. కొన్ని విషయాల్లో ఈ మాట నిజమే గాని అంతకన్న రసప్రధానమైన గ్రంథాలు తెనుగులో ఉన్నాయని అనాలి. పాండిత్యప్రకర్షే కనపరుచుకోవాలి. కవిత్వం అంటే అదే అనే దృష్టితో సంస్కృతం వాళ్ళు వాళ్లని అనుసరిస్తూ తెనుగువాళ్ళు కూడా పడడం చేత రసదృష్టి తగ్గి కథాప్రధానంలోను శబ్దాడంబరాల్లోను విచిత్రయమకబంధాల్లోనూ పడి కాఠిన్యానికి తావిచ్చేరు.

ఇహ తెనుగువాళ్లు ఆశ్రితుల వంశాలు అతిశయోక్తులతో నింపకపోతే యెల్లాగ? వీరు రాయడం కూడా కొంత స్వలాభాపేక్షతోనే. ఏపోతన మహాశయుడో తక్క మిగిలిన మహాత్ము లంతా పెళ్ళాంపిల్లల్ని పోషించుకోడానికే కవిత్వాన్ని చిల్లరక్రింద మార్చుకుని వాడుకొనేవారు. నాటినించి నేటికి ఏ వుద్యోగంకోసమో ప్రయత్నిస్తున్నామంటే ప్రసిడెంటుగారి మీద "నీకళ్ళు చిన్నవి నీముక్కు పెద్దది ఉద్యోగమిప్పించవోయి దేవ!" అని "నాకు డబ్బీయవోయ్ నలిననేత్ర! అని గాని పొగడడం చాలామందికి అలవాటు. అల్లాటివి పుస్తకాల్లో వుంటేనేగాని కృతిభర్తలకి తృప్తి కలగదు చూడండి. ఇహ ప్రతాపరుద్రీయం లాటి గ్రంథాల్లో లాగ ప్రతీ పద్యంలోనూ కూడా వర్ణించకపోవడం తెనుగుప్రబంధాల్లో ఓసుగుణమే.

ఇహ "అతిశయాలు అంకితాలు షష్ఠ్యంతాలు కాళిదాసాదికవులలో లేవని" అన్నారు. అయ్యో. దారితీసిందే కాళిదాసుగారు ఈవిషయంలో. అసలు షష్ఠ్యంతా లంటూ వుంటే దాల్లోనే అతిశయాలు అంకితాలు గర్భితంగా వుంటాయి. రఘువంశం మొదటి సర్గలో—

"సోహ మాజన్మశుద్ధానా మాఫలోదయకర్మణాం
ఆసముద్రక్షితీశానా మానాకరథవర్త్మనాం"
యథావిధిహుతాగ్నీనాం యథాకామార్చితార్థినాం
శైశవేభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణాం
వార్ధకే మునివృత్తీనాం యోగే నాంతే తనుత్యజాం"

ఇల్లాగే ఇంకాను. మచ్చు ఇది—ఇల్లాటివే మన తెలుగువారికి త్రోవ చూపించేయి తప్పకుండాను. అన్ని నిజాలు కాకపోబట్టి మామిత్రుల వ్యాసంలో ఐదో పేరాలో చెప్పినట్లు కోతలు పరమకోతలూ కూడా షష్ఠ్యంతాలలో వున్నాయంటాను. ఇహ సప్తమ్యంతాలు మాత్రం ఎక్కడా లేవు. షష్ఠ్యంతాలైనా కాళిదాసుగారు ఐదంటే మన తెనుగువారు మరో నాలుగు రాసి స్వతంత్రించేరు. ఎత్తిపొడెయ్యడం ఎవ్వరికీ తప్పలేదు. ఈ విషయాలు మాత్రం అధునికకృతులలో ఎక్కులేదు.

"ప్రత్యేకత్వం కోసం దేవులాడుతున్న ఇప్పటి రకంవారిలచె భావం ప్రధానంగా" అని వ్రాసిన దాల్లో నాలుగుపాదాలూ ఒకే అనర్ధసంస్కృత సమాసంగా వున్న అధునికకృతులలో పద్యాలని తీసి మామిత్రులు చూపిస్తే పేరున్న వాట్లలోంచి వాట్లలో భావం ఉన్నదీ లేనిదీ కొంత తంటాలుపడి తెలుసుకొని ఐనా చెప్ప సాహసిస్తాము. అప్పటికీ "నలనాళీకమృణాల నాలలతికానవ్య ప్రణాళీమిళల్లల నాలాపకథాసుధానురసలీలాలోలచేతస్క" లాంటిసమాసా లుంటే మేము మాత్రం తప్పకుండా నిరర్థకపదాలు చాలా వున్నాయని వప్పుకోమూ? అంతేగాని పూర్తిగా భావం లేదనిమాత్రం అనడానికి సాహసం చాలదు. ఎంచేత నంటే "నహి సర్వ

స్సర్వం జానాతి'' కనుక అల్లాటి దీర్ఘ సమాసాలున్నా అచ్చతెనుగే బాగా నేటి వాఙ్మయంలో వుందని చెప్పడానికి వెనకడుగు పడదు. అయోమయమైన భావానికే ప్రాధాన్యం ఆధునికు లిచ్చేరంటే ఆ అయోమయం మనబుద్ధిలోని కాదు గదా? అని కొంచెం ఊహ ఉండాలి. తప్పను. అతని వాత అడిగి తెలుసుకోవడం ముఖ్యం—

ఇంక అతిశయోక్తుల విషయం మాట్లాడితే మామిత్రుల దృష్టి ఆధునిక కావ్యాలలో విసుగు కలిగించేలా వుందని ఫలితంగా చెప్పేరు. కావ్యానికి సొగసు తెచ్చేదే యీ అలంకారంట. ఇది పాతలోనే వుందనడం చాలా పొరపాటుట, అసలు అతిశయోక్తిని రెండు రకాలుగా విభాగిద్దాం. వ్యక్తిగతం ఒకటి, ప్రకృతిగతం రెండూను, ఈ రెంట్లోనూ పాతలో పాడైనచోట్లున్నాయి. అందమైన ఘట్టాలు న్నాయి.

డబ్బే ప్రధానంగా కవిత్వదుకాణాలు పెట్టడం చేత ఏగట్టులంక వేసుగునే రాజుగార్నో తీసుకొని లేనిపోని ఉత్ప్రేక్షలు అతిశయోక్తులు కల్పించి ఆబండితోలే రాజుగారికి శరీరంమీద ఎల్లాగో ధీరోదాత్త లక్షణం పూసి అలంకారపుస్తకాలకి అడ్డు లేకుండా కావ్యప్రశస్తి చెడకుండా. రాయడం ప్రాచీనులలో కొందరి ఆచారం. వెనుకి సిరెట్టుగు నేటప్పుడు అడ్డొచ్చిన పదిమంది పంచమసోదర్లని పడత న్నిన వెలంధోరగారైన వారు మహాఘోరసంగ్రామాలు చేసిన చక్రవర్తి శిఖామణులు. వారి కొంపలు పర్ణశాలలైనా అవి చేసే పని "లిఖంతి విధుమండల" మే. తిండితిప్పల్లేక చావడానికి సిద్ధంగా వున్న రెండేనుగులు మాగాడు కంచరగుఱ్ఱాలు వుంటే చాలు ఇహ వాటి మదధారలతో కొత్తగా కాలవ విడిచిపెట్టినప్పుడు భూమి అంతా తడిసినట్లు తడిసి అంబలైపోయి ఆబాడి మార్గస్థులని దించుకుపోయేలా చెయ్యడమే.

జీతం నాతం లేని పదిమంది నౌకర్లు పనిపాటలు చేయడాన్కి కొంపలో వుంటె వాళ్లే మహాసైన్యాలయిపోయి వాళ్ల నడకలకి రేగిన బూడిది సూర్యచంద్రమండలాన్ని కప్పడమే. ఏముష్టివాడికేనా గుప్పెడు బియ్యం పెడితే యే చకశబ్దం లేకుండా ఇహ ఆయన భూమి నుద్ధరించి రాజే. వాడు పరుండేది దూడిపరుపైనా అది బంగారందే వారు తినేది అన్నమైనా సువర్ణద్రావకమే. లేకపోతే డబ్బెల్లా వస్తుంది బాబూ?

ఇంక ప్రకృతిగతాతిశయోక్తులని చూస్తే పైవాటిని మించిపోవలసిందే. మేమవిషయం చెప్పేను గాదు? ఇల్లాగే తోటలు వర్ణించాలంటే ప్రపంచకంలో మహారణ్యాల్లోను దేశాంతరాల్లోను గాని బతకని "సరళతమాలతాలహారి చందన చంపక నారికేళ కేసర కదలీలవంగ పనస క్రముకార్జున కేతకీలతాగురు ఘనసార" తుమ్మ వెలగ బూరుగ మఱి జిల్లేడు మొదలైన అద్భుతమైన తుక్కు— ఆతోటలో నాటవలసిందే. ఇవి ఆనాటివారికి రుచించినట్లు మన ఇప్పటి వారికి రుచింపవు వీళ్ల కెంతసేపూ ప్రేమతో పెంచుకొన్న సంపెంగ పొదలు, ఉల్లమిడి పెంచుకొన్నట్టి మల్లెతీగలు బిళ్లగన్నేరు వకుళ కేతకి రేరాణి గులాబి చేమంతి మొదలైన అందమైన మొక్కలే పాతుగుని సంతోషిస్తారు. ఇల్లా అన్నానని చెప్పి ఇల్లాంటివి ప్రాచీనాల్లో లేవనడం కాదు. కాళిదాసు పువ్వులతోటలు కమ్మగా వుంటాయి. విజయవిలాసాన్నైనా తారాశశాంకవిజయాన్నైనా తీసుకుని ఇహ ప్రబంధాలన్నీ ఇదే రకం అని తిట్టడం చాలా తప్పుమాట. మొత్తం సకటు మీద మాట వ్యక్తిగతంగా కూడా భావకవుల అతిశయోక్తులు మానవత్వాన్ని అతిక్రమించవు. అల్లా రాయకపోయినందువల్ల వీరికిబ్బందులు లేవు. వీరిపుస్తకాలు స్నేహధనమును గాని ప్రేమధనాన్ని గాని ఫలంగా అపేక్షిస్తాయి కనక ఒహర్ని "ఏతావానస్య మహిమా" అనడం గాని, కోపంవచ్చిన

మహాత్ములకు పడబూతులు తిడుతూ శతకాలు దస్కాలు రాయడం గాని వీరికి అనవసరం. ఒక వేళ సంప్రాప్తించినా యెదిరివ్యక్తి తన జీవితంలో మెరిసిన రెండు మూడు నిజమైన సంగతులే సహజంగా చెప్పవలె గాని అభూతకల్పన లుండవు ఆయన గుణాల్ని వర్ణించలేక శేషుడు పరిగెత్తడు బృహస్పతి తలొంచుగోవడం గాని షణ్ముఖుడు సన్ముఖుడవడం గాని చతుర్ముఖుడు దుర్ముఖుడవడం గాని వుండదు చంద్రుడు గుంపిన అప్పలరాజు గారి కీర్తిలతాకుసుమం కాదు సూర్యుడు తాతరాజుగారి తేజఃపుంజం కాద. ఇంకా కీర్తులు బయలు దేరి పసిబొజ్జ తాను కాటికలాంటి నల్లవస్తువుల్ని తెలుపు చేయలేదు. ఇల్లాంటిది పెద్దల వాసన. అయితే యివన్నీ తప్పులని గాదు నామాట. ఆకాలాని కవ్వీరుచించెయి. రెండు పుంజీల వందల సంవత్సరాల నించి "పాడిందే పాటరా" అన్నట్లు ఆభావాలే ప్రతిదాల్లో చదువుకోంటే వెకటించరా? రెండు రోజులు వరసగా ఇంటోది పెసరపప్పు పచ్చడి చేస్తేనే రోజూ వెధవ పచ్చడేనా? అని చావ తిడతామే? కొత్త వింత పాత రోతా అని మహవాళ్లు ఊరికే అన్నారూ! ఆన్నాళ్లు ఆచిరుగుగుడ్డలు కట్టుకోవడం? ఓగుడ్డలో నేనా మానం కాపాడేటంత జాగా వుంటేనా? బట్టబయులు.

మరిన్ని రసవిషయం ఎత్తేరు. ఎత్తే ఆధునికకవిత్వాన్ని తిట్టేవా రనీ మాటలే మామిత్రులు కూడా అన్నారు. ఆపేరా చివర "శృంగారం ప్రాచీనులలో ఎక్కువ వుం దంటూరు. ఇప్పటివారు ఆరసం తప్ప మరోదాన్ని కావ్యాలలో వర్ణించరే! ఇది మహా బాగుంది కామోసు" అని అన్నారు. ఏం? ఎందుకు బాగుండదు? ప్రాచీనశృంగారం ఆధునికశృంగారం ఓలాగే వుంటుందా? నిజంగా ఈవిషయం పుస్తకాలలోంచి ఎత్తి వ్రాస్తే ప్రాచీనులలో ఆడదీ మొగాడు అందుకే పుట్టినట్లున్న అందులో ఆడదాని వర్ణన వస్తే చాలు ఆమె తల్లిలాటి దేవతైనా సరే కచకుచజఘనవర్ణలతో కాళ్లదగ్గరనుంచి వెంట్రుకలదాకా నో తిరగమరగేశో వర్ణించేయ వలిసిందే! ఆవర్ణనలోను బాహుమూలరుచులతోను పోపు గబ్బిచనుదిబ్బలతోను క్రంగన వాగు గుబ్బలతోను త్రాచుపాము లాంటి నూగారుతోను ఇసకతిప్పలతోను రంభలతోను ఆవర్తాలతోను నిండిపోవలిసిందే. ఈక్రమం ఎవ్వడు తప్పినా ఇహ వాడి కావ్యం అధమాధమక్రా తన్నమాటే. అక్కడికిగాని ఆపూర్ణశృంగారరసంలో స్త్రీ తాండవించదు. పూర్వం రాసేవాళ్లు పురుషులే గనక తమ రహస్య స్థానాలని వర్ణించుకోలేదు అరుదుగా వున్న అప్పటి కవయిత్రులుకూడా కవిరాక్షసులకి జడిసో మరే మో పాపం వారికిమల్లే వీరు తెగించలేరు తెగించి రాయడం ప్రారంభిస్తే ఆశృంగారం మొగశృంగారం కలిసి బ్రహ్మనిష్పత్తి కలగవలసిందేమటి. ఇల్లాటిదిగదా పెద్దల ప్రబంధమార్గం—

ఆధునికులది ఇంతకన్న చాలా రాజూకని తప్పక వప్పుకోవాలి. ఎంత సభ్యమో అంతే రాస్తారు. అతి ఐతే రసాభాస జుగుప్స తప్ప మరే ముంది? ఇంక శృంగారమే తీసుకుందికి కారణం ఏమిటంటే? ఇది రసరాట్టు గాదు మరి? తేదీగాక అన్నిరసాలకంటె దీంతో మనుష్యుల కున్న సంబంధం ఎక్కువ. దానిలోవున్న హాయి మరోదానిలో లేదు కనక దీనిలో నైనా కశ్మలం తీసి పారేసి సభ్యమైన శృంగారాన్ని రాయడంలో తప్పేమిటి?

"కవితన్నే నాయకుడి లాగ స్పష్టపరుచుగుంటాడు. నాయకుడికి లాగ కవి కూడా శృంగారరసపిచ్చి యెక్కువవుతుంది." నిజమే. అల్లా కవి ఎప్పుడు నాయకుల్లో లీనమయ్యేడో అప్పుడే తడతవీరం గాని శృంగారం గాని విషాదం గాని ఘోర్సుగా కవిత్వంలోకి కలంగుండా జారడం మొలరాళ్లు పాతుకుంటూ రాసే ఛందోబద్ధమాట లన్నీ కవిత్వం కావు కవిత్వా గాని. దీనికి తార్కాణం ఏమిటంటే? శృంగారరసపిచ్చికి కాళిదాసుగార్ని శోకరసపిచ్చికి భవభూతిగార్ని గాని తెనుగులో ఈతణ్ణి విరచించిన కంకంటి పాపరాజ

గార్ని గాని దైన్యంలో పోతన్నగారి "లావొక్కింతయు లేదు" గాని ఓమాటు తలుచుకుంటే "అపి గ్రావారోదిత్యపి దళతి వజ్రస్యహృదయం" ఇల్లాగే క్రోధంలో వేణీసంహారంలో భీమన్నగారి "మధ్నామి కౌరవశతం" ఇల్లాటివి భావిస్తే తన్మయత్వం లేని కవిత్వం తంపటద్దాలికే లా కనిపిస్తుంది. ఇల్లాటి వాటినే బొమ్మకట్టు కవిత్వా లంటారు. ఏభావం పద్యంలో రాస్తే ఆబొమ్మ కళ్లకి కట్టాలి. అప్పుడు కవి తన్మయుడవడం ఒక విధమైన పొంగు తెచ్చుకోవడం. అవసరం. ప్రాచీనకావ్యాలలో లేశాలు గాను విరళం గాను వున్న దాన్ని మజ్జిగ మీద వెన్నపూసలాగ నివిరి పోగేసి అక్కడక్కడ ఇల్లాటి ఘట్టాలు తగులుతే వచ్చే సంతోషాన్ని ప్రారంభించింది మొదలు అనుభవింపవేదా మని ఏ విషయం చెప్పేటప్పుడు తద్గతభావాలతో ఐక్యమైపోయి రాయబడే కవిత్వం నేటిది. ఈతన్మయత్వం ప్రాచీనాల్లో అసలే లే దనడం అధునికాలని ఆక్షేపించి నట్టే. ఇల్లాటి మాట అదీ యిదీ చదవని అర్ధనారీశ్వరులది—

"ఇల్లాటి కవిత్వా లన్నీ వాఙ్మయానికి పురోభివృద్ధికే మూల మంటూ కొందరి యువకుల ఆశయం" అవును. కాకిపిల్ల కాకికి ముద్దు. పుట్టిన పిల్ల లంతా డిప్టీ కలక్టరు, డియంవోలు అవుతా రనే తండ్రి పెంచుతాడా? ఏవడ్డగింజో గొంతుకలలో వేసి మరయా చెయకూడదు? తుప్పూ ధూళీ పట్టి బూజుకట్టి పోయిన పదరత్నాలనీ భావమణులనీ వృత్తముత్యాలనీ తీసి మెరుగెట్టేడు. పాతలో యివి నూటికీ కోటికీ గాని దొరకవు. కష్టపడ్డాడు ఏర్చి కూర్చేడు వాఙ్మయోపకారం అయితే ఔగాక. అంతే గాని వాఙ్మయాన్ని పాడుచెయ్యలేదు గదా? ఓపిసరేనా ఉపకారం చెయ్యదా?

"ఇప్పుడు కొంతమంది నెలపిల్లలు కూడా కవయిత్రులు కవీశ్వరుల్లా అయిపోయి పత్రికల కెక్కుతున్నారు" తమకా కడుపుబ్బు ఎందుకు మిత్రమా! దినదినము మన సంఘంలో జ్ఞానజ్యోతి అభివృద్ధి అవుతోం దని సంతోషించవోయ్. కవిత్వం రాస్తే నేనే రాయా లని బొడ్డుకోసి నువ్వే పేరెట్టుగున్నావా? బాగుండచ్చు బాగుండకపోవచ్చు. ఇది రంకూ బొంకూ కాదు గదూ? సమృద్ధిగా పత్రిక లున్నాయి. వేసే ఎడిటర్సుని మేం ఎరుగుదుం. మాకు బంధువులే వారు "అన నవగ రాగ మలిశ యిల్లుచు నుండు" నాయనా విచారించకోయ్. తిట్టకోయ్! అని నాకో మిత్రుడిచ్చిన సలహా. "న ధర్మవృద్ధేషువయః సమీక్ష్యతే" కనక ఏపుట్టలో ఏపాముందో?

"ఒక చిత్రం ఈవాఘ్య"

తల్లి:—నాన్నా! మంచి వన్నీ యిలా పాడిచేస్తే ప్రకృతి శ్మశానం ఐపోదూ?

బాలుడు:—అమ్మా! క్షమించాలి. ఎరగక చేసేను—

విసుగ్గా తల్లి రుసరుసలాడుతూ వొచ్చి కొడుకుమీద ప్రేమతో చేష్టాకోపం మాటలోకి దింపి ఊతంగా "నాన్నా మంచి వన్నీ పాడుచేస్తే" అనే సరికే పాడుచేసే వస్తువు అక్కడ పారేసి ఉలికిపడి దిగ్గున లేచి పిల్లవాడు పైమాట అనడం స్వభావికమే. అప్పుడా పిల్లాడికి ప్రకృతి శ్మశానం సంగతి తెలియనక్కర్లేదు. ఎందుచేత నంటే చేసేది తప్పు పనిగా? ఆపని చేస్తూ ఏసందునించి అమ్మొస్తుందో అని కనిపెడుతూనే ఉంటాడు అసలు. ఇల్లాగే పిల్లలు మనం మాట్లాడే మాటల కన్నింటికి అర్ధం గ్రహిస్తారు. చూడండి. కృష్ణుడు నాలుగేళ్ల పిల్లాడే. "నాన్నా! మన ఇంట్లో బోషాణం దగ్గర పుస్తకం పెట్టుగునే వ్యాసపీట మీద నాపెద్ద లావు పుస్తకం భాగవతం ఉంది. ఇల్లా పట్రా" అంటే పైమాటలలో పిల్లాడు గ్రహించేది పుస్తకం పెట్టుగునే పీట పెద్ద లావు పుస్తకంను. అవ్వే కళ్లకి కడతాయి ముందు. పట్రమ్మనే చెయ్యాపులో గ్రహించి దాన్ని తెచ్చి అన్న కిస్తాడు. అంతే కాని ఆపీట వ్యాసపీటో వసిష్ఠపీటో ఆపుస్తకం భాగోతమో తోలుబొమ్మలాటో వాడి కేం తెలుస్తుంది? అల్లాటి

మాటల్ని గాని పనుల్ని గాని చూస్తే మామిత్రులు రాసినట్లు ఆశ్చర్యం పడాలి. ఆనంద పడాలి అంతేనే గాని విచారించడం అనవసరం. ప్రకరణం అది గాదు కనక—

ఇంకో మంచి చూపించా లంటే చాలా వుంది. కొత్త కవులలో గాని, వారి గ్రంథాలలో గాని "సరసాగ్రేసరకూచిమంచికుల భాస్వద్వార్ధిరాకాశశిన్ సిరకీర్తిన్ బహుశాస్త్రలక్షణమహాధీమంతుండన్" అని గాని "ఇగి శ్లేషయమకచక్రవర్తిత్యనేక బిరుదాంకితచతుర్విధకవితాధురీణ" అని గాని చేసుగునే స్వకుచమర్దనలు ఉండవు. ఏదేనా రాయడానికి ప్రారంభిస్తే దాని కంటె ముందు ప్రతీ ప్రబంధకర్తల కలలలోనూ వాళ్ల తాతలో ముత్తాతలో కనపడి రాయ మని చెప్పడం ఒక అలవాటు. ఇది ముందే భారతకవులకో నిజంగానో కాదో జరిగి ఉంటుంది ఇహ శతాంధన్యాయంగా అందరూ అంతే. ఇల్లాంటి కలత నిద్దర్లు ఇప్పటి వారికి లేనేలేవు.

మొత్తంమీద మంచి చెడ్డలు విమర్శిస్తే రెండింటలోనూ వున్నాయి అభిమానం గల దాన్ని ఎత్తేసి రెండోదాన్ని తిట్టడం విమర్శకలక్షణం గాదు. ప్రపంచం అంతా మారేటప్పుడు కవిత్వం కూడా మారాలిసిందే. ఐతే కొత్తదారి తయారు చేస్తున్నప్పుడు చెత్త చాలా వోస్తుంది. దాన్ని ఎల్లాగో సహించడం మంచిది. తండ్రి చెప్పినట్లు కొడుకులే వినని కాలంలో నే చెప్పినట్లే మీ రందరూ వినాలంటే వినివా రుంటారా? వింటే చివరకి స్వారాజ్యం లా తయా రౌతుంది లోకం. కనక సాధ్యమైనంతలో మంచినే తీసుగోండి. చెడ్డ చదవకండి. రాస్తున్నా రని తిట్టకండి. కాసకి నిగ్గే నిలుస్తుంది పూర్వగ్రంథాలిని తిట్టొద్దు. ఇప్పటివాటిని తిట్టొద్దు. కొత్త కవిత్వంలో కొత్త లేదనడం లోటే. ఈ కొత్తచ్ఛాయలు ప్రాచీనులలో అక్కడక్కడ లేకపోవడం లోటె. చూడండి—

"జలకము లార్చి పాండుజల
జచ్ఛదపాళికఁ గప్పి తమ్మిసం
కుల తెలిదేనె లుగ్గులిడి
క్రొందరగల్ కదలించు కల్వ తో
టెలల కుమారు కూతురు ఘ
టించి భజింతు నవీలలాము కో
మలకుముదాంగ తాళి కుల
మంజరవంబున పాటపాడుచున్"

"తనకుం గౌగిలి యీ వొకప్పుడును నా
ధాంకరస్పర్శనం
బున గిల్గింతలె యంచు పద్మిని కరాం
భోజంబున న్మందమం
దవటద్వాయుచలద్దళాంగుళులు గ
న్పట్టంగ నవ్వోలురా
యని రారా యని బిల్చె నా దగ ద్విరే
ఫాద్యంతదీర్ఘధ్వనుల్"

అని వ్రాసేరు. ప్రాచీనులలోని గంపలకొలంది పద్యాలలో ఈపైలాటివి అన్ని విషయాలలోనూ భేదాన్ని చూపిస్తూన్నాయి—

"త ఏవ పదవిన్యాసా స్త ఏవార్థ విభూతయః
తదాపి నవ్యం భవతి కావ్యం గ్రథనకౌశలాత్"

అన్నట్లు కూర్పునేర్పు చేతను, హృదయపరిపక్వముల చేతను, దివ్యానుభూతులతోనూ, ప్రతిభావిశేషంతోనూ, నిర్మించిన కవిత్వశిల్పం గుండెకు తాకుతుంది అల్లాటి దాన్ని విన్నప్పుడే సహృదయుడు కంట నీరెట్టడమో, వేడిరక్తం ఉప్పొంగి రౌద్రమూర్తి అవడమో, కరుణామూర్తి అవడమో తటస్థిస్తుంది—

యత్సంరభః కృతివిరచనే
సత్కవీనా మభేద్యో
యశ్చైకాగ్ర్యం తదుచిత పదా
న్వేషణే చిత్తవృత్తేః
లభ్యం తచ్చే దపి కవయతా
మంతత స్త్రిణ్యాహాని
స్యాదేవం కిం సరసకవితా
రాజ్యదుర్భిక్షయోగః

అని ఓమహాత్ముఁడు చాలా విచారించేడు—

అస్పృశ్యత

ఉభయ భాషా ప్రవీణ భువనగిరి లక్ష్మీకాంతమ్మగారు

ఒక మాలెత, భుజంమీద బిందెతో ఒక బ్రాహ్మణి.

బ్రాహ్మణి—ఎవరే? ఎవరే నువ్వూ అంత రాసుకొస్తున్నావూ?

మాలెత—ఏ మమ్మోయి! - నోరు మూసుకో. లేసంటే వూసులు బాగా రానియ్యి. ఏ మనుకొన్నావ్?

బ్రాహ్మణి—నే నే మన్నానే నిన్నూ? ఎవరు నువ్వన్నాను. తప్పా? బ్రాహ్మలం వస్తూవుంటే కాస్తంత తప్పకోవద్దూ? ఇంత దొళ్ళదోవా?

మాలెత—ఎల్ల వమ్మా ఊ' గుంజాకోకా. ఏమే. యేమే యేంటీ? ఎవ ళ్లనుకున్నావ్?

బ్రాహ్మణి—ఏమే అంటేనే తప్పొచ్చిందా? మాలెత ఏమండీ, అనిపించుకోవడం మీకు మంచిది కాదు సుమీ.

మాలెత—ఏంటీ? మాకూ మీకూ తేడా యేంటమ్మా?

బ్రాహ్మణి—మీకూ మాకూ తేడా. లేనే లేదంటావూ?

మాలెత—ఏం వుం దేంటి?

బ్రాహ్మణి—మీకు ఆచారవ్యవహారాలూ, శుచీ, శుభ్రమూ వున్నాయిటే? యిది తేడా కాదూ?

మాలెత—మీరూ మానుకుంటున్నారుగా? కాదంటే మావాళ్లూ మిమ్మల్ని చూసి నేర్చుకుంటూనే వున్నారుగా? ఇంక తేడా యేదీ?

బ్రాహ్మణి—మీరు కల్లు తాగుతారు.

మాలెత—మీవాళ్లూ తాగుతున్నారు, గపితి చేసుకో.

బ్రాహ్మణి—మీరు పందిని తింటారు.

మాలెత—మీరు మేకల్ని తిండం లేమూ యెగ్గల్లోనూ?

బ్రాహ్మణి—మీరుగొడ్లు అమ్ముకు బతుకుతారు,

మాలెత—మీరు బిడ్డల్నమ్ముకు బతుకుతారు.

బ్రాహ్మణి—ఆఁ, ఆఁ, ఏం దుండగం? కళ్లూ కాళ్లూమన్నొగుటేయింకాయింకా మీదికివస్తావూ?

మాలెత—అసమానం నీళ్లలో నాన్తూ వుంటే నీ కళ్లూ కళ్లేమన్నకుండా పోతాయి.

బ్రాహ్మణి—ఎదిరిస్తావా? ఎదిరిస్తావుటే? నీకు తిండి దొరకొద్దూ? ఇంతటితో సరా?

మాలెత—నా కే మమ్మోయ్? నీకే తిండి దొరక్కుండా పోతుంది. పాలా లమ్ముకుంటావు. కూలికెళ్లలేవు. పనిచేతకాదు. కైత్తవులికే గాని వుద్దోగాలు లేవు. నువ్వే తిండి దొరక్క మాడి సస్తావు.

బ్రాహ్మణి—ఏమిటే?...ఏమిటే? నీ మొండితనం? సిగ్గూ బిడియమూ విడిచిపెట్టావా యేమిటే?

మాలెత—నీకా నాకా సిగ్గు లేకపోతా? మీవోళ్లంతా మా మంచాలమీద కూకుని, మావోళ్లతో సావాసం చేసి, ఇళ్లలోకీ, గుళ్లలోకీ, చబల్లోకీ, నూతులకాడికీ బఁమాలి మావోళ్లని తీసుగెల్తూ వుంటే, కల్చి బోనాలు సేత్తూ వుంటే, నువ్విప్పుడు "అచుగుంటూ" "అచుగుంటూ" అని మొరుగుతున్నావు. సిగ్గులేని వో ళ్లెవరమ్మోయ్?

బ్రాహ్మణి—అయితే, అమ్మో! పెద్దా, పిన్నా కులమూ, మర్యాదా, అంటూ లేనుటే! మా పొలాలలో పని చేసుకు బతికేవాళ్లు గదా మీ కింత తుళ్లిపాటు తగునా?

మాలెత—డబ్బున్న వోళ్లే గొప్పోళ్లు. వాళ్లకే మరేద. అన్నికలాల వోళ్లనీ దేముడే పుట్టించాడు. ఎన కెప్పుడో మీకు మేము సాకిరీ సేస్తే యిప్పుడు మీకు మీయీడుల తుపత్తం లేదటమ్మా?

బ్రాహ్మణి—ఇంతేనా? దేశ మంతా యిల్లా మండిపోవలసిందే యింకా?

మాలెత—వొక దేశపోళ్లం. మీలాగే మేమూ సీమూ నెత్తురూ వున్న వోళ్లం. మనుసులం. మమ్మల్నిలా తరిమికొట్టినల్లాళ్లూ మండిపోకే పూర్తీ?

కొత్తా—పాతా

కొడవటిగంటి కుటుంబరావుగారు

అనేకమంది మాట్లాడేటప్పుడు ముందూ వెనకా చూడకుండా మాట్లాడతారు; అనేకమంది అవిధంగానే రాస్తారు. వీరికి దేన్ని గురించీ దీర్ఘంగా ఆలోచించటం అలవాటు ఉండకు పేత కానూ కాదు. తాగిన వాడి శరీరం దానికి చెందిన చైతన్యం వాడి వశంలో లేనట్టు, వారి మనస్సులూ ఆలోచనలూ వారి కట్టుబాటులో ఉండవు. అటువంటి వారి అభిప్రాయాలను బులుసు వేంకటరమణయ్యగారు "తెలుగువారి దేశభాషాభిమానం" అనే వ్యాసంలో చక్కగా ఖండించారు. వారు కొత్త పాత వాఙ్మయాలను గురించి మూడో పేరాతోనే ఆపక చర్చించుకుపోయినట్లయితే ఆవ్యాసం మరో విధంగా పరిణమించేదని నా అభిప్రాయం.

వేంకటరమణయ్యగారు సెలవిచ్చినట్టు కొత్త పాతలకూ మంచిచెడ్డలకూ సంబంధం లేదు. ఆ రెంటిలోనూ ఈరెండూ ఉన్నై. కాని చెడును మంచి ఎట్లాగో పాతకు కొత్త అట్లాగని వారు గమనించలేదు. మిగతా వ్యాసం అది రుజువు చెయ్యటానికి వినియోగిస్తాం.

ప్రకృతిలోనే పాతవి నశించి అవి నశించే లోపల కొత్తవాటి అంకురాలు ఏర్పడటం ఉంటున్నది. ప్రతివస్తువూ పాతపడుతుంది. వాఙ్మయం కూడా అంతే. శాశ్వత వాఙ్మయం (books for all time) అనే మాట అక్షరాలా నిజం కాదు. షేక్స్పియరు పుస్తకాలకు చావు లేదనటం కార్లైల్ మొదలయిన వాళ్ల ఛాందసం.

వాఙ్మయంలోకి అప్పుడెప్పుడూ అమూల్యమైన గ్రంథాలు రాకపోవు. వాటిమీద మనకు గల అభిమానంచేత మనం వాటిని వదిలిపెట్టకపోవచ్చును ఎంత కాలానికీ—మహాప్రస్థానానికి అర్జునుడు గాండీవం చంకపెట్టుకు పోయినట్టు—ఒక యిల్లాలు పెళ్ళికి పిల్లిని చంకపెట్టుకు పోయినట్టు. కాని తెలివి గలవాడు ఏపుస్తకం పని ఎప్పుడైపోయిందీ తెలుసుకోగలిగి ఉండాలి. ఇన్ ఫ్లిమెంట్ రూములో వేసి వచ్చిన పదిహేనుమూసాయల భోజనమైనా సరే ఇరవై నాలుగు గంటల్లో విసర్జించవలసిందే జీర్ణమూలకోశాలమీద అభిమానం కలవాడైతే. అంటే ఇన్ని రోజులకో కొత్త పుస్తకం చొప్పున కావలిసి ఉంటుందా అని ఎవరైనా అడగవచ్చును. శరీరం ఎంత సున్నితంగా ప్రిసిషన్‌తో పనిచేస్తున్నదో మనసు కూడా అంత సున్నితంగా పనిచేస్తే అటువంటిది జరగవచ్చును.

"అబద్ధం ఆడకూడదు" "దొంగతనం చేయరాదు" అన్న ముక్కల కూడా మార్పు రావాలి. ఒకప్పుడు అబద్ధం ఆడకూడదనే నీతి చెప్పి హరిశ్చంద్రోపాఖ్యానం ఉదాహరణగా చెబితే అద్భుతమైన పని జరగవచ్చును. ఇప్పటి కూడా ఈపని చేసే నీతికథామంజరులు లేకపోలేదు కాని ఎప్పటికైనా క్లాసులో కుర్రవాడు లేచి, "అయ్యా, హరిశ్చంద్రుడు అబద్ధం ఆడలేదేమో కాని అతని ప్రవర్తన చాలా అఘోరించినట్టున్నది. అందులో ఒక్క రవ్వ సత్యం లేదు. ఆ స్థితిలో మేము ఏం చెయ్యాలి? నక్షత్రకుడి గుద్దులు తోడాలా? బాకీ లేదు పో పొమ్మనాలా? లేక పరమేశ్వరుడో అడ్డుపడక పోతాడా అని పెళ్ళాం గొంతు కొయ్యాలా!" అని అడిగితే ఏంచేస్తారు? వాణ్ణి రెండు గంటల సేపు బెంచి ఎక్కిస్తారా? లేక పాతపడ్డ హరిశ్చంద్రోపాఖ్యానం అవతల పారేసి, "అబ్బాయీ, నిజం ఎందుకు చెప్పాలంటే, నిజం చెప్పటానికి భయపడటం నామర్దా కనక! నిజం చెప్పి ఎవరికి చెయ్యలేని ఉపకారం అబద్ధంతో చెయ్యగలిగితే అవశ్యం అబద్ధం ఆడు!" అని చెబుతారా?...ఈపద్ధతి కూడా ఎప్పటికీ పనికొస్తుందనుకో బోకండి! దానికీ మార్పు రావాలి.

అమూల్యమైన పుస్తకాలన్నీ సంస్కృతంలోనే ఉన్న వన్నారు వేంకటరమణయ్యగారు. ఇంగ్లీషులోనూ ఫ్రెంచిలోనూ రష్యనులోనూ ఇంకా అనేక భాషల్లో కూడా ఉన్నవి. నాముత్తాత యొక్క గొప్పతనం నాకెంత ఉపకరిస్తుందో సంస్కృతంలో ఉన్న గొప్పతనం తెలుగు కంత ఉపకారం చేస్తుంది. నాముత్తాత నాకెట్లా బంధువో సంస్కృతం తెలుగుకు అంతే చుట్టం. సంస్కృత పదాలు తీసుకుని భయంకరంగా మార్చి తజ్జలన్నారు. మృత్యువు అనే మాటను మిత్తిగా మార్చినవారు ఎంతకైనా సమర్థులే. ఏభాష చదివినవాడి కాభాషలో రాయాలని ఉత్సాహం ఉండటం సహజం. సంస్కృతం చదువుకున్న పండితులు జాస్తిగా తెలుగులో సంస్కృతం వాడారు. ఒక్క సంవత్సరం పైమిస్తే ఇరవైవేల ఇంగ్లీషు మాటలనో వాటి తద్భవాలనో తెలుగులోకి తెస్తాను!

నేటి వాఙ్మయం యొక్క నమూనాలకింద రెండో మూడో చాతకాని వారు రాసిన కథలూ, కేవలం పదిమందీ చదివి అవతల పారేసే నిమిత్తం రాసిన కథలూ తీసుకోవటంలో వేంకటరమణయ్యగారు పొరపాటు చేశారు. అచ్చుపడ్డ దల్లా వాఙ్మయమే అయితే మాఊళ్ళోనే అచ్చయిన కంపెనీ నోటీసులతో ఒక గ్రంథాలయం మారుతుంది.

ఈవ్యాసం పొడిగించి లాభం లేదు. నాఅభిప్రాయం ఏమిటంటే? గురజాడ అప్పారావు కంటె గొప్పవాడు అంతకన్న హృద్యంగా రాసేవాడు కాడు. అంతకన్న ఒక అడుగు ముందుకు వెళ్లినవాడు. ఈముందుకు వెళ్లటం ఏమిటని అడగవచ్చు. ప్రస్తుతం సత్యాన్వేషణ అమలులో ఉంది. ప్రతిదాన్ని గురించీ నిజం తెలుసుకో గోరుతున్నారు. ప్రతి రచయితా ఆపనిమీదే ఉండాలి. ఏదో రూపంలో ఆపని చెయ్యాలి ప్రతివాడూ. (అలెక్క ప్రకారం కూడా పద్యవాఙ్మయంతో మనకు పని లేదు.)

ఇట్లా పోగా పోగా సత్యాన్ని చేరుకుంటామనేది పొరపాటు. సత్యం తీక్ష్ణమైనది. అందరూ దాన్ని తేరి చూడలేరు. సూర్యుణ్ణి సమీపించిన సంపాతి మోస్తరుగా అవుతుంది మన గతి. అందుచేత మనం జటాయువల్లే త్వరలోనే మేలుకుని వెనక్కు తిరిగి పరిగెత్తుకొస్తాము. అప్పుడు గొప్పవాడు సత్యాన్ని కప్పిపెట్టేవాడు. మన రామాన్సులకూ, కావ్యాలకూ, పద్యాలకూ భలే మైం!

ఈసందర్భంలోనే ఇంకో పని జరిగితే చాలా బాగుండును. ప్రతివ్యాసం వాఙ్మయానికి బొజ్జపెంచుతున్న దని, ప్రతి రాతగాడూ సారస్వత సేవకు డని ఒక దురభిప్రాయం ఎక్కడ పడితే అక్కడ కనపడుతున్నది. ఒక చెంప ముడిగట్టుకున్న వాళ్లనూ చూస్తే అరసున్నాలు సరిగా ఉంటే కాని తాకట్టు లేదు. మరోచెంప ఒక్కొక్క పత్రికాసంపాదకుల అహంకారం చూస్తే "డు, ము, వు, లు ప్రథమావిభక్తి అవునా? కాదా?" అనే దానిమీద నాలుగు పేజీలు రాసి అవు నని తేలిస్తే కాని సాహిత్యం కాదు. ఏదో విధంగా తాత్కాలికవాఙ్మయాన్ని శాశ్వతవాఙ్మయాన్ని విడదీసే ఏర్పాటు జరిగితే బాగుండును.

"హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారం"

ఈవిషయాన్ని గురించి మాకు లేఖలు కావాలి. ఒక పావు టావు ఒక వేపుకంటే యెక్కువ వుండకూడదు. హిందీ ప్రచారకులను హద్దులో వుంచడం మాత్రమే మా వుద్దేశం—

సంపాదకుడు

వ్యాఖ్యానములు

అదీ మాట

"అస్పృశ్యులను దేవాలయాలలోకి తీసుకు వెళ్లాలంటే కొత్తవాటిని నిర్మించడం యుక్తమైన పని, గాని శాసనాల కుమ్మక్కుతో బలాత్కారంగా పాతవాటిలో ప్రవేశపెట్టడం నీతి గాదు. దేవాలయాల విశిష్టపవిత్రతనూ, బ్రాహ్మణగౌరవాన్ని రక్షించుకోడమే బ్రాహ్మణధర్మ మని భావించే హిందువులు, దేవాలయాలకు సంబంధించిన తమ ప్రత్యేకాధికారాలను తమకి తామై వొదులు కోవడం కోరతగ్గది; కాని శాసనాలను నిర్మించి వారిని అలా చేసేటట్టు నిర్బంధించడం ధర్మం కాదు."

అసెంబ్లీలో వున్న రంగయ్యరుగారి బిల్లును గురించి హోముసెక్రటరీగారికి రాస్తూ, పంజాబునందలి బ్రహ్మసమాజకార్యదర్శి అన్న మాట లివి.

పరమతసహనానికి యింత చక్కని వుదాహరణ మరొకటి దొరకదు.

ఈదేశంలో వర్ణాశ్రమధర్మాలు ఇవాళ యేర్పడలేదు. శాస్త్రసిద్ధమైనా కాకపోయినా అస్పృశ్యత కూడా నేటిది కాదు. ఇంతవరకూ పూజాపురస్కారాలు పొందుతూ వున్న దేవాలయా లన్ని చాతుర్వర్ణ్యంవారికి తరతమమైన ప్రవేశాధికారం యేర్పరిచి నిర్మించబడ్డవి.

"అస్పృశ్యులుగూడా మనవంటి హిందువులే. వారికి కూడా మన కుండే సర్వాధికారాలూ వుండా"లంటే యిది కాలాన్ని బట్టి, ఉదారనీతిని బట్టీ ధర్మసమ్మతమైనదే. అయితే చిరసంచితమైన సంప్రదాయమే మంచి దని భావించే వారి మీద దీనిని రుద్దడానికి యెవరికీ అధికారం లేదు. "అస్పృశ్యత వుండితీరాలి, మతపావిత్ర్యానికి అది అక్షరాలా అగత్యం" అని నమ్మేవారు తమ విశ్వాసాన్ని సంస్కారవాదుల మీద అమలుజరుపడాని కెలా వీలు లేదో అలాగే యిదీని. అయితే సంస్కారవాదులకు వొక సవ్యమార్గం వుంది. అస్పృశ్యులకు ప్రవేశాధికారం యిచ్చే పద్ధతిని తప్ప ఇక ముందెవరూ ఆలయాలను నిర్మించ గూడదు" అని వారు ప్రచారం చెయ్యవచ్చు. ఈ సిద్ధాంతానికి బలం కలిగే టట్టు వారు శాసనం నిర్మించుకోవచ్చు. అది నిక్కచ్చిగా అమలుజరుపబడేటట్టు శ్రద్ధతీసుకోవచ్చు. అంతే.

సనాతనధర్మవాదులను తమ పట్టుదల వదలుకొనే టట్టుగూడా సౌమ్యమార్గంలో వారు ప్రయత్నాలు చెయ్యవచ్చు; గాని వూరికి వొక్క సనాతనధర్మవాది అయినా వున్నంతకాలమూ దేవాలయాలను గురించి ప్రయత్నాలు చెయ్యడానికి వారికి అధికారం లేదు.

ఈసందర్భంలో మా ఆంధ్రబ్రహ్మసమాజమిత్రులు గమనించ తగ్గ విషయం వొకటుంది. పంజాబు బ్రహ్మసమాజ కార్యదర్శి లేఖ ఈకింది మాటతో పూర్తి చెయ్యబడ్డది.

"బ్రహ్మసమాజసిద్ధాంతాల ననుసరించి ప్రజల మతధర్మా లన్ని మారితేనే తప్ప సత్యమైన దేశాభ్యుదయం కలదు"

త్రికరణశుద్ధి గల మతాభిమానానికీ, హృదయపూర్వకమైన దేశాభిమానానికీ నిదర్శన మిది. అయితే ఆంధ్రబ్రహ్మసమాజికులు కొందరు అస్పృశ్యులను దేవాలయాలలో ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్సువారు చేసే ప్రచారంలో పాలుపుచ్చుకుంటూ వుండడం మాకు తెలుసు. దీనివల్ల సనాతనధర్మవాదులను జయిస్తే జయించవచ్చు; గాని వారు తమ

మతానికి అపచారం చేసినవా రవుతున్నారు. క్రైస్త వమిషనరీలలాగ అస్పృశ్యులను ఉద్ధరించడానికి వారి కనేకమార్గా లున్నాయి. వర్ణాశ్రమధర్మాలతోబాటు విగ్రహారాధన గూడా వారి దృక్పథంలో మూఢవిశ్వాసమే. దురాచారమే. అయినప్పుడు వారు అస్పృశ్యులను ఆలయాలమీదకి రెచ్చగొట్టడంలో యేమి నీతి వున్నదీ?

గాంధిగారు.-అస్పృశ్యత

ఇవాళ గాంధిగారు పంచముల అస్పృశ్యత పోగొట్టడానికి తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు.

వెళ్లిన చోటల్లా సభలు చెయ్యడం. వాటిలో సవర్ణులతో పాటు అస్పృశ్యులను కూడా కూర్చోబెట్టించడం. సవర్ణులను నీతి బోధించడం. సభలలో నగలూ, సొమ్ము వసూలు చెయ్యడం. మాలమాదిగల గూడేలకు వెళ్లి చూసి హితబోధ చెయ్యడం—ఇదీ వారి కార్యక్రమం.

ఈమధ్య వారు రైళ్లూ మోటార్లూ వుపయోగించడం మానేసి పాదాచారిగా నడక ప్రారంభించారు. వొకటి రెండుమాట్లు పరిగెత్తారు కూడాను.

అయితే, ఈకార్యక్రమం మాలమాదిగల అస్పృశ్యతను పోగొట్టడంలో యేమాత్రం వుపకరిస్తుందీ?

ఇప్పుడు వసూలు చేస్తూ వున్న సొమ్ము ఎలా ఖర్చుపెడతారో, అదెలా పని చేస్తుందో తెలుసుకోవా లంటే కొంచెం వోపిక పట్టి చూడాలి; కాని మతవిశ్వాసం మార్చడానికి డబ్బు మంచి సాధన మని మేము నమ్మలేము.

మన దేశంలో వొక పెద్ద అసౌకర్యం యేర్పడిపోయింది. అది యేమిటంటే! మనలో విద్య తక్కువ. ఏదో వొక విధమైన శిక్షణ కూడా లేదు; కాగా ప్రజలు తామే మంచి దని నమ్మింది సాహసించి ఆచరణలో పెట్టలేరు. చెడ్డ దని తెలుసుకొన్నది చొరవచేసి విడిచిపెట్టలేరు.

ఈసన్నివేశం మన ప్రయత్నాల నన్నిటినీ బూడిదలో పోసిన పన్నీటిని చేస్తోంది.

ఇలాంటి స్థితిలో గాంధిగారు రైలులో—నడిచే కావచ్చు, వచ్చి వొక గంట బోధించి వెళ్లిపోతే యేం పని జరుగుతుందీ? వారు ఉన్నంతసేపూ జనులు సభలలో అస్పృశ్యులతో కలిసి కూచోవచ్చు. తరవాత వొకటి రెండువారాలవరకూ వారి ఉపదేశాన్ని మననం చేసుకుంటూ వుండవచ్చు. కాని తరవాత మామూలు ధోరణే. యెప్పటి ఆటే. డబ్బు యివ్వడం లేదా అంటే ఇచ్చేశాక పూచీ వదిలిపోయినట్టే కాదూ?

బుద్ధుడూ శంకరాచార్యుడూ మొదలైన పూర్వాచార్యులు తమ సిద్ధాంతాలు వ్యాపింపచెయ్యడానికి ఇలా చెయ్యలేదు. వారు కొంతకాలం వొకచోట స్థిరంగా వుండేవారు. తమ దైవికశక్తివల్ల ఆప్రాంతాలవారిని తమ వలయంలోకి ఆకర్షించుకొనేవారు. వారికి స్థిరదీక్ష కలిగిన తరవాత అక్కడ వొక పీఠమూ, దానిమీద తమ ప్రతినిధినీ నిలిపి మరోచోటికి వెళ్లిపోయేవారు.

దీనితో పని చేసిన చోట ఫలం ప్రత్యక్షమవడమే కాకుండా స్థిరంగా వుండిపోయేది.

ప్రజల సంప్రదాయాలు మార్చడానికి యింతకంటె మంచి మార్గం మరివొకటి లేదు. అయితే గాంధిగారికి వొకచోట కూచోడానికి వల్లకాదు. వారు అవతల కాంగ్రెస్సుని నడిపించాలి. రాజకార్యాలు చక్కబెట్టాలి. రాటం సంగతి చూసుకోవాలి. పైగా ప్రచారకులను నిలవబెట్టివుంచడానికి డబ్బు వసూలు చెయ్యాలి.

అస్పృశ్యతానివారణం వారికి ప్రధానమే కావచ్చు, గాని అది వొకటే ప్రధానం కాదు. దేనికదే "వ్రతానా ముత్తమం వ్రతమ్."

మరొకలో టేమిటంటే? మొదట్నుంచీ యీ అస్పృశ్యతానిర్మూలనంమీద వారికి అభిమానం వుందంటే అది సత్యమే, కాని ప్రధానమంత్రి

గారి సాంఘికపరిష్కారం మరొకలా వుంటే దీన్ని గురించి వారిప్పటి శ్రద్ధ వహించి వుండరు. పైగా ఆపరిష్కారంలో యిప్పుడు మార్పు కలిగినా వారి కార్యక్రమం మారిపోతుంది ఏమీ సందేహంలేదు.

ఇందులో యింకో అసందర్భం కూడా వుంది.

అస్పృశ్యులు తమకి దేవాలయాలలో ప్రవేశించే అధికారం కావా లని పోట్లాడ్డం లేదు. గాంధీగారు కూడా సొంతానికి దేవాలయంలోకి వెళ్లరు, కాని వారు దేశంలో వున్న దేవాలయా లన్నీ అస్పృశ్యులకు ప్రవేశం యివ్వా లంటున్నారు. గాంధీగారి తుమ్ముల్లోకూడా బ్రహ్మాండమైన వేదాంతార్థం వుం దని వ్యాఖ్యానం చేసేవారు "ఇది ముఖ్యావశ్యకం" అని అంటే ఆశ్చర్యపడ నక్కరలేదు, కాని యిది అనవసరప్రస్తావన. ధర్మబాహ్యం కూడాను.

వారి నడతనే వారు సింహావలోకనం చేసుకుంటే చాలు. ఏమంటే?

స్వరాజ్యం రావా లంటే వారు అందరూ కద్దరు కట్టాలన్నారు. కొందరు కడుతున్నారు. తతిమ్మావారిచేత కట్టించాలి. అయితే వా రందుకోసం నిర్బంధానికి పూనుకున్నారా? శాసనప్రయత్నం చేస్తున్నారా? అస్పృశ్యత అమానుషమే. పైగా మానవత్వానికి భంగకరమే, ఈవిషయంలో సనాతనులు ఇంత ప్రాతికూల్యం వహించడం యీకాలంలో మంచిది కాదు; కాని వారిని బలాత్కారంగా అడగద్రొక్కడం సంస్కారపక్షానికి బలకరం కాదు. పైగా ప్రతికూలం కూడా కావచ్చు.

ఇంతకీ: అస్పృశ్యత యీ దేశంలో చిరసంచితమైన సంప్రదాయం. ఈక్షణంలో కావలసిన స్వరాజ్యం వంటి వుత్కృష్టఫలాలకోసం దీన్ని నుంచుని వుండగా రూపుమాపా లంటె సాగే పని కాదు. తరవాత "నేను చెప్పినట్టు వినలేదు కనక మీకు స్వరాజ్యం రాలేదు" అని ప్రజలమీదే నింద వెయ్యడానికి తప్ప ఈతొందరపాటు మరొకందుకు వుపకరించదు. వెనక డిసెంబరు ౩౧ వొకటి చల్ల చల్లగా గడిచిపోయివుంది. ఇప్పుడు ఆగష్టు౧౪ వ తేదీగూడా అలాగే దాటిపోతుంది. సందేహంలేదు. అయితే అస్పృశ్యత యెంత తొరగా పోతే జాతి అంత తొరగా బాగుపడుతుంది. ఇది మట్టుకు నిజం.

ఇతశ్చ—తతశ్చ

గ్రహించగలవారికి పాట్నాసమావేశం వొక అఖాడసత్యాన్ని పండు వొలిచి చేతిలో పెట్టినట్టు విశదం చేసింది.

తగిలేచీ తప్పేకి యెరక్కుండా శబ్దజాలం కరిసేసే సత్యమూర్తిగారు యెగిరి గంతు వెయ్యవచ్చు. మన తెలుగువారిలో వొద్దూ పొడుగూ గల కొందరు పెద్దమనుష్యులకు వుత్సవవిగ్రహా లయ్యే అదృష్టం మళ్లీ పట్టవచ్చు. కాని కాంగ్రెస్సు పడిపోయింది. పూర్తిగా తల్లకిందు లైపోయింది.

నిజానికి కాంగ్రెస్సుయొక్క ఈదశావిపర్యయం అనుకంపాజనకంగానే వుంది; గాని యీపరిస్థితు లింతవరకూ కలక్కపోవడం ఆశ్చర్యకరమే. గాంధీగారి నియంతృత్వం దేశంయొక్క వర్తమాన స్థితికి అనుగుణ మయింది కాదు. అది సాహసించి కొండెతాచు తోక తొక్కింది. అంతే, కాని ఆ తాచు తిరగబడి కాటు వేస్తే తప్పించుకోలేక పోయింది.

గాంధీగారు అనేకవేలమంది యువకుల జీవితాల మీద ప్రళయతాండవం చేశారు. దీనివల్ల అనేక కుటుంబాల భావినిర్వాహణం నిర్మూలం అయిపోయింది. శాసనోల్లంఘనం స్వయంగా విరమించక యెలాగా తప్పదు కాదు, కాని యీవిరమించడం దొరతనంవారు చెప్పినప్పుడే చేసే యీమాటయినా అనేకులకు జెయిలుబాధలు వెంట వెంటనే తప్పిపోయి వుండేవి. "గాంధీగారు సహకారం అంటే పోట్లాడతారు" అనే మాటలో

అర్థం కనపడి వుండేది. ఇప్పుడలా కాలేదు. ఏమీ కాలేదు.

శాసనసభాప్రవేశసిద్ధాంతంమీద కాంగ్రెస్సు ముద్రని వెనక దాసు నిగ్రహాలు వేయించుకోడానికీ, యిప్పుడు అన్నాగిదేశాయీలు వేయించుకోడానికీ చాలా వారవుంది. అప్పుడు వారిద్దరూ కాంగ్రెస్సులో వొక విప్లవం లేవదీశారు. దేశం అంతా గగ్గోలు పెట్టేశారు. లెక్కా పత్రం లేకుండా డబ్బు విరజిమ్మేశారు. చివరికి తమ అసమానతార్కిక శక్తి వల్ల విజయం పొందారు. ఇప్పుడు వీరలా కాదు. కాంగ్రెస్సువారి పద్ధతిలో శాసనసభలకి వెళ్ళడం దొరతనానికీ దేశానికీ కూడా లాభకరంగా దని స్పష్టపడిపోయింది. పైగా ఈ విషయంలో వీరేమీ ప్రచారం చెయ్యలేదు. మళ్లీ స్వరాజ్యపక్షం యేర్పడడం అవసరం అని యెక్కడో వొక సన్నాయి నొక్కు వినపడింది. వెంటనే రాంచీలో సభ అన్నారు. గాంధిగారు అంగీకరించి దస్కత్తు చేశారన్నారు. పాట్నాలో స్థంకా మీద దెబ్బకొట్టి నెగ్గించన్నారు. అప్పుడే సత్యమూర్తి ప్రభృతులు అసెంబ్లీలో కూడున్నంత వుబలాటపడిపోతున్నారు.

పైగా అప్పటికీ యిప్పటికీ భేదం యేమిటంటే? అప్పుడు శాసనసభాప్రవేశంవల్ల తటస్థించే మంచి చెడ్డలికి ఉత్తరవాదులు పూర్తిగా స్వరాజ్యపక్షంవారు. ఇప్పుడు కాంగ్రెస్సే ఆభారం నెత్తిమీద వేసుకుంది.

ఏం? అప్పటికంటే యిప్పుడు శాసనసభలలో వున్న విశేషం యేమిటి? అప్పటి మాంటుఫర్డుసంస్కరణాలే యిప్పుడూ నిలిచివున్నాయి. అద్వంద్వ ప్రభుత్వమే యిప్పుడూ అమలులో వుంది. అప్పటి సంప్రదాయాలే యిప్పుడూ వున్నాయి. ఏమీ మారలేదు. కాంగ్రెస్సే పల్టీలు కొట్టింది.

పోనీ—అప్పుడు చెయ్యలేని పని యిప్పుడు వీరేం చేస్తారు? ఇప్పుడు శాసనసభలలో అనగ్గా లధికంగా వున్నారంటే కాంగ్రెస్సువారిలో అంతకంటే అనగ్గాలున్నారు. ఇప్పుడు కఠినశాసనాలు తయారవుతున్నాయి కనక అడ్డుపడా లంటారా? వాటికి వీరి శాసనోల్లంఘనమే కారణం. వాటిని తిరగతోడేస్తా మంటారా? శాసనోల్లంఘనవాసన నిశ్శేషం లేశమైనా వున్నంత కాలమూ అవి చెక్కుచెదరకుండా అలాగే వుంటాయి.

ఇక శ్వేతపత్రాన్ని తిరస్కరిస్తా మనే మాట వొకటి వుంది వాస్తవంగా యిది అర్థం లేని మాట. శ్వేతపత్రం అసెంబ్లీహాజరులలోది కాదు. పైగా దొరతనంవారు ముందే మేలుకొని వీరు కల్పించబోయే చిక్కుల కన్నింటికీ పరిహారాలు ఏర్పరుచుకునే శ్వేతపత్రప్రతిపాదనాలను శాసనంలో ధ్రువపరుస్తారు. అలా అయితే వీరు "మేము దాన్ని అంగీకరించ" మంటారా? మాంటుఫర్డు సంస్కరణశాసనవిషయంలో వీరు చేసిందేమిటి?

ఏతావతా: కాంగ్రెస్సువారు శాసనసభలను బహిష్కరించడం తప్పని యిన్నాళ్లకు పూర్తిగా గ్రహించారు, గాని అక్కడి కార్యక్రమాన్ని సుఖసుఖాల జరగనివ్వరట అయితే దీనివల్ల ప్రభుత్వానికి కంటే దేశానికే యెక్కువ అపాయం వుంది.

ఇటు కాంగ్రెస్సువారి శాసనోల్లంఘనమూ దేశాన్ని క్షోభపెట్టింది. అటు శాసనసభాప్రవేశమూ కలతపెడుతుంది. దృక్పథం మారేదాకా కాంగ్రెస్సు ఏం చేసినా యిది తప్పదు.

౧౮ నౌకాభంగము :

కృతికర్త వజ్ఝల వేంకటేశ్వరకవిగారు, బి, ఏ. క్రౌనుసైజు ౧౧+౭౭=౮౮ పుటలు. ముచ్చటయినఅచ్చు మంచికాగితము. వెలపం|డెండణాలు. వలయువారు కృతికర్త గారికి జయపురము విశాఖపట్టణము జిల్లా అని వ్రాయవలెను.

. ఇది యేఁడు ప్రకరణముల పరిమితిగల పద్యరూపమగు నవల. దీనికి మూలమొక యాంగ్ల గ్రంథము. మూలమున కాంధ్రీకరణము లిది వంకే చాల వెలువడినవి. కవిగారు "ఆంగ్ల కావ్యము నందలి కథను హైందవ సంప్రదాయ బద్ధముఁ గావించి స్వతంత్ర కల్పనలు సేర్చి పద్య కావ్యముగా రచించి యున్నారు. ఇందు మేఘుని దౌత్యము మొదలగు స్వతంత్ర కల్పనలు, వర్ణనలు, నెంతయు హృద్యములు.

వేంకటేశ్వరకవిగారు యువకులు. అయినను కవితలో వయసు మీఱిన యనుభవమును, సొబగును అలవరచుకొని ఆంధ్ర దేశము నంతటను పేరు మ్రోసి యున్నారు వీరి కవితలో నవీన రీతులు ప్రాచీన మార్గములు కూడ మేళవింపఁ బడుచుండును, ప్రాచీన నియమములకు లోఁగి భావ నవ్యత కొఱకుఁ బాటుపడు యువక కవులలో వీరొకరు. వీరి యాశయములు వీరి కవిత యందును సువ్యక్తములు. "నౌకాభంగ" మంతయు నవీన మార్గమునను, కృతి సమర్పణము మాత్రము ప్రాచీన పద్ధతిని రచింపఁబడి యున్నది. కృతి సమర్పణమునఁ బ్రాచీన కవిత్వపు పోకడ లెక్కువగఁ గలవు. దీనింబట్టి కవి గారికిఁ గల ప్రబంధ రచనా పాటవము విశదమగుచున్నది.

ఈ గ్రంథమున శైలి మృదు మధురము; నిర్దుష్టము. "దోషైకదృష్టి" తోఁ జూచినను, "సృష్టించి" అను పదము ఒక్కటి తక్క వేఱొద్దియు నిందు వ్యాకరణ విరుద్ధమగు పద మగపడ లేదు. కవిత చక్కఁగ సాగినది. కవి గ్రంథరచనకుఁ దీసికొనిన కథ హృద్యమైనది. సర్వజనాకర్షకమైనది. కవిగారొనరించిన స్వతంత్ర కల్పనలును ఆయా సందర్భములకు బాగుగ అనువయి కథకు వన్నెఁ గూర్చుచున్నవి,

కావ్యమున కానందము పరమావధి. ఆయానందమీ కావ్య పాఠకులకుఁ గలిగి తీరును. మఱియ నిందు జన సామాన్యము గ్రహింపఁ దగిన నీతులనేకములు కలవు. పండిత— పామర జనరంజకమగు నీ చిన్ని కావ్యమును ఆంధ్ర సోదరులెల్ల పఠించి, ఇట్టి గ్రంథములను రచింప గ్రంథకర్తను ప్రోత్సహించుట ఎంతయు నుచితము.

బులుసు వేంకటరమణయ్య

౧౯ చంద్రహారము :

రాజమండ్రి వాణీగ్రంథమాల వారి మూడో పుస్తకము. కర్త: అరవ వెంకటస్వామిగారు. వెల నాలుగణాలు. 1. సంక్రాంతిబహుమతి, 2. శాపం, 3. ప్రేమకి చిన్నతన మేమిటి?, 4. ఈరమ్మ, 5. చంద్రహారము 6. క్షమార్పణ, 7. సంశాయాహానులు. అని ఏడు కథలిందున్నవి. ఇందులో ఒక్క 'చంద్రహారము' తప్ప మిగిలిన వన్ని గ్రంథకర్త స్వకల్పితాలట.

ప్రతికథలోనూ కథావస్తువు ఆకర్షణీయంగా ఉంది. ఆంధ్రుల నిరాడంబరనిత్యజీవితచర్య సహజంగా ప్రతిబింబిస్తూంది. సంభాషణలు ఆహ్లాదకరంగా ఉన్నవి ఘట్టములు (Situations) రెండు మూడు చోట్ల మాత్రం సాధారణజీవిత ప్రవృత్తికి వ్యతిరేకమునై కొంచెం అసహజంగా ఉన్నాయి. కథకుడు గోదావరీప్రాంతస్థుడగు యువకుడు. తరుచుగా మెలగినై, గడిచినై, వ్యగ్రమైనై, పోయినై' ఇలాంటి అన్యప్రాంతీయములను వాడి శైలి కొంచెం కుంటుపరుచుకున్నాడు. "హాశ్చర్యపోయింది పాత్రాత్రాన్ని, అస్పృశ్యభావం, ఎక్కన్నుంచి, మెల్లో లేసు" మొదలైన తప్పు సమాసములును వర్ణక్రమము (Spelling) లో తప్పులును ఉన్నాయి. మొత్తముమీద కథలు ప్రతివారూ చదివి ఆనందించతగినవి మాత్రము అవును.

కా. వేం. రా.